# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY












నడిసముద్రంలో నౌకలో వెళ్లి తనిఖీలు చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

# దర్జాగా.. దందా

కాకినాడ నుంచి కళ్లుగప్పి విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి చేస్తోన్న దందాపై అధికా రులు మళ్లీ పంజా విసిరారు. ఈసారి నేరుగా సముద్రంలోకి వెళ్లి నౌకలో తనిఖీలు చేశారు. స్వయంగా జిల్లా కలెక్టర్ రేషన్ బియ్యం అనవాళ్లను గుర్తించడానికి రంగంలోకి దిగడం సంచలనంగా మారింది. ఎన్నో ఏళ్లుగా కాకినాడ నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతులు జరుగుతున్నా, తొలిసారి తనిఖీల కోసం ఏకంగా నడిసముద్రంలో లంగరేసిన నౌకలో తనిఖీలు చేపట్టడం విశేషం.

- విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతిపై మళ్లీ పంజా
- ఈసారి నడిసముద్రంలో నౌకలోకి వెళ్లి మరీ తనిఖీలు చేసిన కలెక్టర్
- ఇన్నేళ్లలో తొలిసారి నౌకలో ఆకస్మిక దాడులతో అక్రమార్కుల్లో కలవరం
- 38వేల టన్నుల బియ్యంలో 640టన్నుల రేషన్ బియ్యం గుర్తింపు
- ఎగుమతికి సిద్ధంగా ఉన్న లవన్ షిప్పింగ్ బార్జిపైనా బుధవారం రాత్రి దాడులు
- 1,060 మె.ట. రేషన్ బియ్యం గుర్తింపు.. ఇటీవల బీజీతో 750మె.ట బియ్యం రిలీజ్
- 750మెట్రిక్ టన్నులు కాస్తా 1,060కి పెరగడంపై అధికారుల్లో అనుమానాలు
- విదేశాలకు రేషన్‌బియ్యం దందా నిగ్గు తేల్చకపోవడంపై ఇటీవల సీఎం సీరియస్
- ఈ నేపథ్యంలో వరుస దాడులతో ఉక్కు పిడికిలి బిగించిన అధికారులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ నుంచి విదేశాలకు తరలిపోతున్న రేషన్‌బియ్యం దందాపై ఇప్పటివరకు బాధ్యులను గుర్తించకపోవడంపై సీఎం చంద్రబాబు ఇటీవల అధికారులను నిలదీశారు. దీంతో మళ్లీ ఇప్పుడు అధికారులు పంజావిసరడం మొదలుపెట్టారు. అటు ఎగుమతికి సిద్ధంగా ఉన్న లవన్ షిప్పింగ్ కంపెనీ బియ్యం ఎగుమతులపైనా బుధవారం రాత్రి దాడులు చేయగా అందులోను వెయ్యి మెట్రిక్ టన్నులకుపైగా రేషన్ బియ్యం గుర్తించారు. ఇటీవల ఈ సంస్థ నుంచి సీజ్ చేసిన బియ్యాన్ని బీజీ ద్వారా అధికారులు విడుదల చేయగా, అదే బియ్యాన్ని తిరిగి గుట్టుగా విదేశాలకు తరలించేస్తున్నట్లు గుర్తించారు. మరోపక్క సివిల్ సప్లై ఛైర్మన్ తోట సుధీర్ సైతం మంగళవారం కొన్ని గోదాముల్లో తనిఖీలు చేపట్టడంతో అక్రమార్కులకు ఊపిరాడడం లేదు.

## అసలు దోషులింకా దొరికితేగా..

కాకినాడకేంద్రంగా విదేశాలకు రేషన్ బియ్యం గత వైసీపీ ఐదేళ్లపాలనలో లెక్కకు మిక్కిలి ఎగుమతి అయింది. రేషన్ బియ్యాన్ని కారుచౌకగా కొని పాలిష్ చేసి ఎగుమతి చేస్తూ గత ప్రభుత్వంలో కాకినాడ వైసీపీ కీలక నేత ఆయన అనుచరులు వందల కోట్లు సంపాదించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ దందాను అరికట్టడానికి రంగంలోకి దిగింది. స్వయంగా పౌరసరఫరాల శాఖ మంత్రి సైతం పోర్టు సమీపంలోని గోదాముల్లో తనిఖీలు చేశారు. రేషన్‌బియ్యం దారి మళ్లకుండా కాకినాడ పోర్టుకు వెళ్లే దారిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. అయినా అక్రమార్కులు మాత్రం గుట్టు చప్పుడు కాకుండా కొన్ని మిల్లుల్లో బియ్యాన్ని పాలిష్ చేసి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పోర్టువద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు మినహా మిల్లులవద్ద నిఘా లేకపోవడం ఇప్పటికీ రేషన్ బియ్యం ఎగుమతి దందాదారులకు కలిసి వస్తోంది. మరోపక్క ఈ ఐదేళ్లలో సాగిన బియ్యం దందాకు బాధ్యులను ఇప్పటికీ అధికారులు గుర్తించలేదు. కేసును సీఐడీ ద్వారా విచారణ చేయిస్తామన్నా ఆ దిశగా అడుగులు కూడా పడలేదు. దీంతో ఇటీవల సీఎం చంద్రబాబు గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న దందాలపై సమీక్ష సందర్భంగా కాకినాడ నుంచి అక్రమ బియ్యం ఎగుమతి మాఫియాపైనా సమీక్షించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ రేషన్ మాఫియా దొంగలను పట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మళ్లీ తాజాగా అధికారులు జూలు విదిల్చారు. విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతులపై ఈసారి రూటు మార్చి ఏకంగా నౌకలపై కన్నేశారు. ఇందులోభాగంగా దక్షిణాఫ్రికా దేశానికి బియ్యం ఎగుమతవుతున్న స్టెల్లా ఎల్ పనామానౌకలో కలెక్టర్ బుధవారం తనిఖీలు చేశారు.

వాస్తవానికి ఇప్పటివరకు బియ్యం అక్రమ ఎగుమతి తనిఖీ అంటే కేవలం పోర్టు, పరిసరాల్లోని గోదాములే అన్నట్లు అధికారులు వ్యవహరించారు. కానీ కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులకు కూడా ముందస్తు సమాచారం ఇవ్వకుండా అప్పటికప్పుడు బోట్లు సిద్ధం చేయించి ఏకంగా 2గంటలకుపైగా సముద్రంలో ప్రయాణించి నౌక వద్దకు వెళ్లడంతో అంతా అవాక్కయ్యారు. ఒక రకంగా చెప్పాలంటే సముద్రంలో లోడింగ్ జరిగే నౌకవద్దకు అధికారులు వెళ్లడం ఇదే తొలిసారి. మరోపక్క నౌకలో జరిగిన 38వేలటన్నుల బియ్యం లోడింగ్‌ను పరిశీలించారు. ఇందులో 640 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యం గతంలో సీజ్ చేసి తిరిగి విడుదల చేసినవి కావడం విశేషం. కాగా సీఎం చంద్ర బాబు ఆదేశాల నేపథ్యంలో వరుసగా రేషన్‌బియ్యం అక్రమాలపై అధికారులు తనిఖీలు కొనసాగించాలని నిర్ణయించారు.

## మరో నౌకలో..

మరోపక్క దక్షిణాఫ్రికాకు వెళ్తున్న మరో నౌకలో ఎగుమతికి సిద్ధం చేసిన లవన్ షిప్పింగ్ కంపెనీ బియ్యంపైనా బుధవారం రాత్రి తనిఖీలు చేశారు. ఈ కంపెనీ నౌకలో లోడింగ్ చేయడానికి సిద్ధం చేసిన 1,060మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ బియ్యంగా గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఈ కంపెనీ గోదాముపై దాడి చేసి 750 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశారు. ఆ తర్వాత బ్యాంకు గ్యారెంటీ తీసుకుని బియ్యాన్ని విడిచిపెట్టేశారు. తిరిగి ఈ బియ్యాన్ని ఆ కంపెనీ దక్షిణాఫ్రికాకు ఎగుమతికి సిద్ధం చేసింది. విడుదల చేసిన రేషన్ బియ్యం 750మెట్రిక్ టన్నులు అయితే బార్జిలో ఎగుమతి కోసం 1,060 మెట్రిక్ టన్నులు ఎలా సిద్ధం చేసిందనే దానిపై అధికారులు ఆరా తీశారు. తీరా అదంతా ఇటీవల సేకరించిన రేషన్ బియ్యంగా గుర్తించారు. అటు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ సైతం మంగళవారం రాత్రి కరపలో కొన్ని గోదాముల్లో తనిఖీలు చేసి రేషన్ బియ్యం అనుమానాలతో కొంత స్టాకును సీజ్ చేశారు. ఇదే గోదాములో జూన్ 8న పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల తనిఖీలు చేశారు. రూ.10కోట్ల విలువైన 3,357 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. అనుమానంతో మళ్లీ ఇక్కడే తనిఖీలు చేయడం విశేషం. ఇలా వరుసగా అధికారులు నిఘా పెంచడంతో రేషన్ బియ్యం అక్రమ ఎగుమతిదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



తుఫాన్ హెచ్చరికతో కిర్లంపూడిలో వరికోత మిషన్‌తో హడావుడిగా కోతలు కోస్తున్న దృశ్యం



గొల్లప్రోలు పట్టణ శివారులో ఆరబెట్టిన ధాన్యం రాశులు

# తుఫాన్.. గుబులు

- హడావుడిగా మాసూళ్లు
- ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు పాట్లు
- మిల్లులకు తరలింపులో నిమగ్నం
- ఇదే అదనుగా తక్కువ ధరకు కొనుగోలుకు దళారుల ప్రయత్నం
- నెలాఖరు వరకూ మాసూళ్లు, కోతలు వద్దంటున్న అధికారులు

రైతులను అల్పపీడనాలు, తుఫాన్లు వెన్నాడుతున్నాయి. ప్రస్తుత సార్వా సీజన్‌లో కోతలు ప్రారంభమైన నాటినుంచి వస్తున్న వరుస హెచ్చరికలు వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాజాగా జారీ చేసిన తుఫాన్ హెచ్చరికలు గుబులు పుట్టిస్తున్నాయి. పలుచోట్ల హడావుడిగా మాసూళ్లు చేస్తూ.. మరోవైపు ధాన్యం తడవకుండా రక్షణ ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. మరికొందరు ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు దళారులు రైతులు వద్ద తక్కువ ధరకు కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నెలాఖరు వరకూ కోతలు, మాసూళ్లు వద్దని అధికారులు సూచిస్తున్నారు.

పిఠాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రస్తుతం వరికోతలు, నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పలుచోట్ల ఇప్పటికే కోతలు పూర్తి కాగా ఏలేరు, పీబీసీ ఆయకట్టుతోపాటు మెట్ట ప్రాంతాల్లో ఇంకా సగం కూడా కోతలు పూర్తి కాలేదు. పంట ప్రారంభంలో సాగునీటి సమస్యలు, వరుస పకృతి వైపరీత్యాలు, వరదలు వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని రైతులు సార్వాలో వరిని సాగు చేశారు. ఏలేరు, సుద్దగడ్డ, ఇతర కాలువలకు వచ్చిన వరదల కారణంగా 80వేల ఎకరాల్లో పంటకు నష్టం జరిగింది. ఈ నష్టం నుంచి తేరుకుని పలుచోట్ల మరలా వరి నాట్లు వేశారు. ఇవి ప్రస్తుతం వరికంకులో గింజలు గట్టిపడే దశలో ఉన్నాయి. సాగునీటి సమస్య కారణంగా ఆలస్యంగా వరినాట్లు వేసిన ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది.

## గండం గట్టెక్కామనుకుంటుండగా..

రెండు వారాలు క్రితమే బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఆ సమయంలో వరి కోతలు, మాసూళ్లు ప్రారంభమయ్యాయి. స్వల్ప వర్షాలతోనే దాని ప్రభావం దాటిపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. తదనంతరం వరి కోతలు, మాసూళ్లు ఊపందుకున్నాయి. ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలోని 1.07లక్షల ఎకరాలకుగాను 40శాతం విస్తీర్ణంలో ఇప్పటి వరకూ కోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. గండాలుగట్టెక్కామని భావిస్తున్న తరుణంలో బంగాళాఖాతంలో అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి తుఫాన్‌గా రూపాంతరం చెందింది. దీనిప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశంఉందన్న వ్యవసాయశాఖ హెచ్చరికలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

## అంతా హడావుడే

ప్రస్తుత సార్వా సీజన్‌లో రైతులు అధికంగా వరికోత యంత్రాల ద్వారానే మాసూళ్లు నిర్వహించారు. దీనివల్ల రెండు గంటల వ్యవధిలోనే ధాన్యం చేతికందడంతో రైతులు ఇటువైపే మొగ్గు చూపుతున్నారు. ధాన్యాన్ని తేమ తగ్గేవరకూ ఆరబెట్టాల్సి ఉంటుంది. రైతులు కళ్లాలు, ప్రధాన రహదారులు, మెరక ప్రాంతాల్లో ధాన్యం ఆరబెట్టారు. ఏ క్షణమైన వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ధాన్యం రాశులు తడిచిపోకుండా టార్పాలిన్లు, బరకాలు కప్పడంతోపాటు నీరు నిలవకుండా రక్షణ చర్యలు తీసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఆరిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు లేదా మిల్లులకు తరలిస్తున్నారు. బుధవారం కొంత మేర ఎండకాసినా సాయంత్రమయ్యేసరికి మబ్బులు అలముకోవడంతో ధాన్యాన్ని బస్తాల్లోకి నింపి లారీలు,



ధాన్యాన్ని సంచుల్లో నింపి మిల్లులకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు ద్వారా మిల్లులకు తరలించేందుకు నిమగ్నమవుతున్నారు.

## తక్కువ ధరకు కొనేందుకు..

వాయుగుండం, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులనుంచి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనేందుకు దళారులు ప్రయత్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఎక్కువ మంది మిల్లర్లకే విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మిల్లర్ల తరపున ధాన్యం కొనుగోలు చేస్తున్నామంటూ కొందరు వ్యక్తులు రంగప్రవేశం చేసి 75కిలోల బస్తాను మార్కెట్ ధర కంటే రూ.200 నుంచి రూ.300 తక్కువకు కొనుగోలు చేస్తున్నారు.

### 30వ తేదీ వరకూ మాసూళ్లు వద్దు

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 30 వరకూ లేదా తుఫాన్ ప్రభావం తగ్గేవరకూ వరికోతలు, మాసూళ్లు చేయవద్దని రైతులకు సూచించడంతోపాటు అవగాహన కల్పించాం. ఇప్పటికే మాసూళ్లు పూర్తయిన 90శాతం వరకూ పంటను రైతులు విక్రయించారు. మరో 6శాతం పంటలను మిల్లులకు తరలించాల్సి ఉంది. మరో 4శాతం పంట వర్షాలకు తడవకుండా రైతులు రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. వర్షాలు తగ్గేవరకు కోతలు, మాసూళ్లు వాయిదా వేసుకోవాలి.

-పి.స్వాతి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు, పిఠాపురం

# నౌకలన్నీ బంద్

- కాకినాడ పోర్టులో ఒకటో నెంబర్ తుఫాను హెచ్చరిక జారీ
- ఈనెల 30వరకు సముద్రంలో ఎక్కడి షిప్పులు అక్కడే..
- కాకినాడకు బియ్యం, ఇతర కార్గో కోసం పది నౌకలు రాక
- వీటిలో 8 నౌకల్లోకి సరుకు లోడింగ్ నిలిపివేత

7

- సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బార్జీల రాకపోకలకూ రెడ్‌సిగ్నల్

# ఐటీఐ.. ఉపాధికి షార్ట్‌కట్!

6

- పారిశ్రామిక వృద్ధితో నిపుణులకు అవకాశాలు
- ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అందుబాటులో వేలాది సీట్లు

# ఒకరోజు ముందే..

- ఈనెల 30వతేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు
- డిసెంబరు 1న సెలవు కావడంతో ముందే పంపిణీకి నిర్ణయం
- జిల్లాకు రూ.115కోట్లు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వతేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడానికి అధికార యంత్రాగం సర్వం సిద్ధం చేసింది. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ చేయనున్నారు. కాకినాడ జిల్లాలో మొత్తం 2,73,881మంది పింఛనుదారులు ఉండగా రూ.115.69కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. దీనిలో ఓఏపీ 133765మందికిగాను రూ.53.68కోట్లు కేటాయించింది. వితంతు పింఛన్లు 72983మందికి రూ.29.34కోట్లు, దివ్యాంగులు 35069మందికిగాను రూ.21.09కోట్లు విడుదల చేసింది. ఒంటరి మహిళలకు రూ.3.15కోట్లు, మత్స్యకారులకు రూ.2.53 కోట్లు, చేనేత కార్మికులకు రూ.1.39కోట్లు, డప్పు కార్మికులకు రూ.64లక్షలు, ట్రాన్స్‌జెండర్ రూ.5లక్షలు, చిత్రకారులకు రూ.4లక్షలు, సైనిక వెల్ఫేర్ పింఛన్లు రూ.లక్ష విడుదల చేశారు. సచివాలయ ఉద్యోగులు పంపిణీకి సిద్ధంగా ఉన్నారు.

# ఇమ్యూనైజేషన్‌పై రెండురోజులపాటు వర్క్‌షాప్

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులకు, సూపర్‌వైజర్లకు ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలోని శిక్షణ పై రెండురోజులపాటు వర్క్‌షాప్ జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైంది. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రొటీన్ ఇమ్యూనైజేషన్‌పై సంబంధిత అధికారులకు వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే ఏఎన్ఎంలు, యుడబ్ల్యుఐఎన్ పోర్టల్‌లో పిల్లలను నమోదు చేసి వారికి ఇచ్చిన వ్యాక్సిన్ వివరాలు పోర్టల్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలి అనేది వివరించారు. జాతీయ ఇమ్యూనైజేషన్ ప్రణాళిక యాడ్వర్స్ ఈవెంట్ ఫాలోడ్ బై ఇమ్యూనైజేషన్(ఏఈఎఫ్ఐ), కోల్డ్ స్టోరేజ్, మైక్రో ప్లానింగ్ ఇమ్యూనైజేషన్ ఏ విధంగా చేయాలో పీపీటీ ద్వారా వివరించారు. వ్యాధి నిరోధక టీకాలు ప్రణాళిక ప్రకారం ఎలా వేయించాలో వైద్యాధికారులకు, సూపర్‌వైజర్లకు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశాలు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, డాక్టర్లు తరచూ రొటీన్ ఇమ్యూనైజేషన్‌పై అవగాహనా సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయడం ద్వారా జిల్లాలో ఒక ప్రణాళిక ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయడంవల్ల నూటికి నూరు శాతం ఇమ్యూనైజేషన్‌ను విజయవంతం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ సుబ్బరాజు, ఎస్ఎంవో డాక్టర్ జాన్‌జూడే జాషువా, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత, పీవో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ ఐ.ప్రభాకర్, డీపీఎంవో డాక్టర్ సురేఖ, డీఎంవో డాక్టర్ రవికుమార్, డెమో ప్రసాదరాజు పాల్గొన్నారు.





సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

# కాకినాడ కార్పొరేషన్‌లో మళ్లీ బదిలీలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ మేనేజర్‌గా పనిచేస్తున్న కర్రి సత్యనారాయణను అకౌంటెంట్‌గా రెవెన్యూ ఆఫీసర్ కేఎస్ శిరీష్ కుమార్‌ను అకౌంటెంట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వీరిని ఈ మధ్యకాలంలోనే సెక్షన్లు మారుస్తూ బదిలీ చేశారు. మార్పు చేసి నెల తిరగకుండానే తిరిగి ఎవరి స్థానాలకు వాళ్లను బదిలీ చేస్తూ కర్రి సత్యనారాయణకు మేనేజర్ బాధ్యతలతోపాటు అకౌంటెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అకౌంటెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న శిరీష్‌కుమార్‌ను తిరిగి రెవెన్యూ ఆఫీసర్-1గా యథాస్థానానికి పంపించారు. ఇప్పటివరకు రెవెన్యూ ఆఫీసర్-1గా పని చేస్తున్న జి.దుర్గారావును ఇంజనీరింగ్ సెక్షన్ సూపరిండెంట్‌గా బదిలీ చేస్తూ కమిషనర్ భావన బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీర్ఘకాలికంగా ఆయా సెక్షన్లలో పనిచేస్తున్న వారిని కదపకుండా నెల తిరగకుండానే ఈ బదిలీలపట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

# ప్రాణం ఖరీదు.. రూ.3లక్షలు

మెయిన్‌లో..

- జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యం
- డయాలసిస్ పేషెంట్‌కి ఒక బ్లడ్ గ్రూపు బదులు మరొకటి
- ఆరోగ్యం క్షీణించి మహిళ మృతి

# ఓటర్ల జాబితాను దోషరహితంగా రూపొందించాలి

- జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు ప్రవీణ్‌కుమార్
- జిల్లాలో అక్టోబరు 29నాటికి 16,35,030మంది ఓటర్లు
- 8,04,886మంది పురుషులు
- 8,30,052మంది మహిళలు
- కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాను దోషరహితంగా రూపొందించడంలో సంబంధిత అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ శాఖ కమిషనర్, డైరెక్టర్, కాకినాడ జిల్లా ఎలక్ట్రోల్ రోల్ అబ్జర్వర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో కలిసి ఎస్ఎస్ఆర్-2025 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై ఈఆర్ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నోడల్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో అబ్జర్వర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమైనదన్నారు. అలాంటి జాబితా రూపకల్పనలో ఎలాంటి తప్పులకు తావులేకుండా స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు పకడ్బందీగా ఓటర్ల జాబితా స్క్రూట్నీ చేయాలన్నారు. గ్రామస్థాయిలో బీఎల్వోలను సెన్సిటైజేషన్ చేయాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు కూడా భాగస్వాములు కావాలన్నారు. రానున్న నెలరోజుల సమయంలో ఈ విషయంపై ప్రత్యేక దృష్టిపెట్టాన్నారు. బీఎల్ఓలతో ఈఆర్‌వోలు సమావేశం నిర్వహించాలన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు బీఎల్‌వోల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఓటర్ల తొలగింపు సమయంలో ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ జిల్లాలో ఒక పార్లమెంటు నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. అక్టోబరు 29నాటికి 16,35,030మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. వీరిలో 8,04,886మంది పురుషులు ఉండగా 8,30,052మంది మహిళలు, 190మంది ఇతరులు ఉన్నారన్నారు. జిల్లాలో 1640 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, డీఆర్వో వెంకట్రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓటర్ల జాబితా పరిశీలకులు ప్రవీణ్‌కుమార్




# ఐటీఐ.. ఉపాధికి షార్ట్‌కట్!

ఒకప్పుడు ఐటీఐలో చదివారంటే ఉద్యోగం గ్యారంటీ. అప్పట్లో ఏ కోర్సుకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటే అంతా అదే ట్రేడ్‌లో చేరిపోయేంత క్రేజ్ నడిచేది. టెక్నాలజీకి పర్యాయపదం ఐటీఐ. ఇంజనీరింగ్ కాలేజీలు వచ్చాక ఆ ప్రభ కొంత తగ్గింది. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు విస్తృతంగా పెరగడం, ఫీజు రీయంబర్స్‌మెంటు ద్వారా పేదవర్గాల వారూ చదువుకునే అవకాశం కలగడంతో ఐటీఐ దాదాపు కనుమరుగైపోయింది. కానీ కొవిడ్ తర్వాత పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు చదివేవారు మళ్లీ పెరిగారు. ప్రాక్టికల్ నాలెడ్జికి పెద్దపీట వేసే ఐటీఐకి ఆదరణ పెరిగింది. స్వల్ప వ్యవధిలో ఉపాధి అవకాశాలు పొందడానికి ఐటీఐ ఒక చక్కని దారి. అంతేకాదు,, ఇంకా చదవాలంటే అటు పాలిటెక్నిక్‌లో చేరి అనంతరం ఇంజనీరింగ్ పూర్తిచేసే బ్రిడ్జి కోర్సు సైతం ఉండడం విశేషం.


(ఆంధ్రజ్యోతి- కాకినాడ కార్పొరేషన్)

- పారిశ్రామిక వృద్ధితో నిపుణులకు పెరుగుతున్న అవకాశాలు
- ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అందుబాటులో వేలాది సీట్లు
- ఐటీఐల్లో మొత్తం 13 ట్రేడ్లు
- స్కిల్ హబ్ ద్వారా ఎన్నో ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్

పది తర్వాత కేవలం రెండేళ్ల కోర్సు పూర్తిచేస్తే ఉద్యోగం పొందే అవకాశం ఐటీఐలో మాత్రమే ఉంది. ఈ కోర్సు పూర్తి చేసి అప్రెంటీస్ చేస్తుండగానే జీవితంలో స్థిరపడడానికి వీలుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పారిశ్రామిక రంగం వేగవంతంగా వృద్ధి చెందుతుండడంతో ఐటీఐ చేసిన వారికి సులువుగా జీవనోపాధి పొందవచ్చు. పూర్వం ఐటీఐ చదివారంటే ఉపాధి అవకాశాలు పొందడం గ్యారంటీ అనే పరిస్థితి ఉండేది. ఇంజనీరింగ్ కాలేజీలు అందరికీ అందుబాటులోకి రావడంతో కొన్నేళ్లపాటు అందరూ అటు వైపే వెళ్లారు. కొవిడ్ తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అనేక మార్పులొచ్చాయి. ప్రాథమిక స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం పొందిన వారికి కూడా ఏదొక ఉపాధి దొరుకుతోంది. దానికి అనుగుణంగా పారిశ్రామిక విస్తరణ మరిన్ని అవకాశాలను కల్పిస్తోంది. నిర్మాణ రంగం మరెన్నో చిరుద్యోగాలను సృష్టిస్తోంది. దాంతో స్వల్ప వ్యవధిలో ఉపాధి పొందడానికి ఐటీఐలు దోహదం చేస్తున్నాయి. ఐటీ రంగం కుదేలు కావడంతో టెక్నికల్ కోర్సుల వైపు విద్యార్థులు మళ్లడానికి మరో కారణమైంది. పది తర్వాత ఐటీఐ పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు పొందడానికి మార్గం ఉంటుంది. విద్యుత్, రైల్వే రక్షణ, పలు ప్రభుత్వ ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తాయి. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడ్స్‌లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహంలేదు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్ ఏర్పాటుచేసి విద్యార్థులకు నైపుణ్యాంశాలపై శిక్షణ ఇస్తోంది. ఒకవేళ ఐటీఐ పూర్తి చేసిన వారు ఇంకా చదవాలనుకుంటే పాలిటెక్నిక్ డిప్లమోలో నేరుగా రెండో సంవత్సరం ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

## ఏడాది, రెండేళ్ల వ్యవధితో కోర్సులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడలో అతి పెద్ద ఐటీఐ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఉంది. ఇది ప్రస్తుత కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు ఉమ్మడిగా కొనసాగుతోంది. కాకినాడ జిల్లాలో మరొక ప్రభుత్వ ఐటీఐ ఉంది. మొత్తం కాకినాడ, జగ్గం పేట ప్రభుత్వ ఐటీఐలలో 728 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఉంది. ఇవికాకుండా ప్రైవేటు ఐటీఐలు ఒక్కో జిల్లాలో డజను వరకు ఉండి.. వేలాది సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉంచాయి. ఆయా ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాలపరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ తదితర కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరాలనుకునే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏఏ ఐటీఐల్లో ఉన్నాయో వెళ్లి పరిశీలించుకోవాలి. ఇందులో విద్యార్థులతోపాటు విద్యార్థినులకు కూడా కోర్సులు ఉన్నాయి. దరఖాస్తుల పరిశీలన పూర్తైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు.

## ఉపాధికి ఢోకా లేదు..

### ఉన్నత చదువులకు అవకాశం

ఐటీఐ కోర్సుల్లో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తిచేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశముంది. ఐటీఐ పూర్తిచేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశముంది. పాలిటెక్నిక్ పూర్తి చేసి బీటెక్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపరుచుకోవచ్చు. ఇలా పలువురు విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి బాగా స్థిరపడుతున్నారు.

### ఈ ఏడాది 338 మందికి ప్లేస్‌మెంట్స్

ఇక కాకినాడ ప్రభుత్వ ఐటీఐకి సంబంధించి ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల్లో 487 మందికి ఈఏడాది క్యాంపస్ ఇంటర్వ్యూలు ద్వారా ప్రముఖ కంపెనీలైన ఎల్అండ్‌టీ, ఏపీ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఐటీసీ లిమిటెడ్, బ్లువాసన్, ఎలైడ్ సర్వీసెస్, న్యూకాన్, ఏరోస్పేస్, వోల్‌మాన్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీల్లో 338 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మిగిలిన వారికి త్వరలోనే ప్లేస్‌మెంట్ అవకాశాలు ఏర్పాటుచేయనున్నారు. వందశాతం ప్లేస్‌మెంట్ పూర్తవ్వనుంది.

### 100 శాతం ప్లేస్‌మెంట్ దిశగా..




ఉద్యోగం సంపాదించి స్థిరపడాలనుకునే వారి కి ఐటీఐ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయి. దరఖాస్తు పరిశీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరుకావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్ నెంబర్‌కు పంపిస్తాం. పదో తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్లు ఉంటాయి. విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్ కల్పించాలన్నదే మా ప్రధాన ఉద్దేశం.

- ఎంవీజీ వర్మ, కాకినాడ గవర్నమెంటు ఐటీఐ ప్రిన్సిపల్, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్



# గురువులకు నెలవు!


దివంగత పొత్తూరి చంద్రరాజు (మేడ చంద్రరాజు)


దివంగత పొత్తూరి సత్యనారాయణరాజు

చదువు జీవితానికి మార్గదర్శి. సంస్కారానికి దిక్సూచి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ చక్కని రహదారి. ఒక కుటుంబంలో చదువుకున్న వారుంటే ఆ వంశవృక్షం ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతుంది. ఉన్నత శిఖరాలను అందుకుంటుంది. ఇది ఒక కుటుంబ విజయం కాదు.. ఒక ఊరి విజయం.. ఊరంతా టీచర్లు కావడానికి ఒకనాడు పడిన బీజం.. ఆ సంగతేంటో చదవండి...

(ఆంధ్రజ్యోతి-ముమ్మిడివరం)

అదొక చిన్న గ్రామం.. అయితే ఆ గ్రామంలో గడపగడపకొక టీచరు ఉండడం విశేషం. ఎందరో విద్యావేత్తలను, మేధావులను తీర్చిదిద్దిన ఘనత ఆ గ్రామానికి ఉంది. ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామం ఉపాధ్యాయులకు నెలవు. గ్రామ జనాభా 1561 కాగా 652 కుటుంబాలు ఉన్న ఆ గ్రామంలో వందమందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారంటే విశేషమే కదా మరి. వీరిలో 60 మంది కాలంచేయగా మరో 20 మంది విశ్రాంత ఉపాధ్యాయులుగా ఉన్నారు. ప్రస్తుతం వివిధ గ్రామాల్లో 25 మంది వరకు నేడు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరిలో సగంమంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరు కాకుండా ప్రైవేటు పాఠశాలల్లో 15 మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరో 15 మంది ఎన్ఐఆర్‌లు, తెలంగాణ రాష్ట్రంలో 15 మంది ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి పొందుతుండగా, రక్షణ, పోలీసుశాఖ, ఆర్టీసీ, విద్యుత్, తపాలా శాఖ, టెలిఫోన్ శాఖ, ఆరోగ్య, పంచాయతీరాజ్, సబ్ రిజిస్ట్రార్, కోఆపరేటివ్ బ్యాంకుల్లో ఇంకో 25 మంది వరకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 1917లో గ్రామంలో పొత్తూరి చంద్రరావు (మేడచంద్రరాజు) ఆధ్వర్యంలోను బాలుర ఎయిడెడ్ పాఠశాల, పొత్తూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో బాలికల ఎయిడెడ్ పాఠశాల స్థాపించి ఉపాధ్యాయులను నియమించి ఎంతోమందికి విద్యాబోధన చేశారు. 1950లో అదే గ్రామానికి చెందిన వీపూరి కృష్ణంరాజు ఐ.పోలవరంలో ఒక ఎయిడెడ్ పాఠశాలను ఏర్పాటుచేసి చినకొత్తలంక నుంచి కాలినడకన సుమారు ఆరు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి విద్యాబోధన సాగించేవారు. ఆనాటి నుంచి నేటి వరకు చినకొత్తలంక గ్రామం ఉపాధ్యాయులకు పుట్టినిల్లుగా ఉంది. ప్రతీ కుటుంబం నుంచి ఒక ఉపాధ్యాయుడు డీఎస్సీలో ఎంపికకావడంతో ఆ గ్రామం ఉపాధ్యాయుల గ్రామంగా పేరొందింది. కొంతమంది డీఎస్సీలో సెలక్ట్ కాగా ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరికొంతమంది ప్రైవేటు విద్యాసంస్థలు ఏర్పాటుచేసి విద్యాబోధన సాగిస్తున్నారు. గ్రామంలో విద్యావంతులు ఎక్కువగా ఉండడంతో ఆ గ్రామం అభివృద్ధిలో ముందుంది. పాఠశాలకు పక్కా భవనం, అంగన్‌వాడీ భవనం, గ్రంథాలయ భవనం, కమ్యూనిటీ భవనం, మహిళా మండలి భవనం వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి.

### వారి స్ఫూర్తితోనే ఉపాధ్యాయ వృత్తి



గ్రామంలో పొత్తూరి చంద్రరాజు, పొత్తూరి సత్యనారాయణరాజు, వీపూరి కృష్ణంరాజుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిలో స్వీకరించా. మా కుటుంబంలో పెదనాన్న, చిన్నాన్న, బావలు ఉపాధ్యాయులుగా పనిచేశారు. అందువల్లే నేను, మా పిల్లలు ఉపాధ్యాయ వృత్తిని ఎన్నుకున్నాం. ఎంతోమందికి విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన తృప్తి ఉంది. ఉపాధ్యాయ సంఘంలో చురుకైన పాత్ర పోషించి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశా. ప్రస్తుతం విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా.

- పీవీవీ సత్యనారాయణరాజు, రిటైర్డ్ ఉద్యోగ సంఘ ప్రధాన కార్యదర్శి

### అభివృద్ధికి విద్యే మూలం



పెద్దల స్ఫూర్తితోనే ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చా. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులు చదువుతోపాటు మానసిక వికాసం చెందేలా బోధన చేస్తున్నా. కొవిడ్‌లో యూట్యూబ్ చానల్ ద్వారా ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించాను. నా వినూత్న బోధనా పద్ధతులను మెచ్చుకుని 2003లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలపై కూడా పోరాటాలు సాగించేందుకు ఉపాధ్యాయ సంఘ మండల శాఖ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నా. నేను పొందిన విజ్ఞానాన్ని నలుగురికి పంచాలన్నదే నా ఆశయం.

- పి.హిమబిందు, ఉపాధ్యాయిని, చినకొత్తలంక

## ప్రత్తిపాడులో వైభవంగా గౌరీదేవి సంబరాలు


ట్రాక్టర్లపై దేవతామూర్తుల అలంకరణలతో ప్రదర్శన

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో గౌరీదేవి సంబరాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. మున్సుబ్ వారి రామాలయం వీధిలోని గౌరీ శంకర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ట్రాక్టర్లపై కళాకారులు లవకుశలు, సీతా రామ లక్ష్మణులు, పార్వతీపరమశ్వరులు, ఆంజనేయుడు, వినాయకుడు, కనకదుర్గ, సాయిబాబా వేషధారణల్లో అలరించారు. బాణసంచా, డప్పుల వాయిద్యాల మధ్య కళారూపాల ప్రదర్శన గ్రామ పురవీధుల గుండా కొనసాగింది.

## బాల్య వివాహాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత... బాల్య వివాహాలు సాంఘిక దురాచారం: కలెక్టర్ ప్రశాంతి**

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకునే బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత స్పష్టం చేశారు. జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా అన్ని చర్యలూ చేపడుతున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం రాత్రి జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'బాల్య వివాహ ముక్త్ భారత్' కొవ్వొత్తుల ర్యాలీని వారు ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీజే మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమే కాకుండా తగు వయసు రాకుండా పెళ్లి చేయడం వల్ల విద్య, ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తాయన్నారు. బాల్య వివాహాల నిరోధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా అంగన్వాడీ, ఆశా, మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 18ఏళ్లలోపు ఆడపిల్లలు, 21ఏళ్లలోపు మగ పిల్లలకు వివాహం చేస్తే వారిని ప్రోత్సహించిన వారు, సమాచారం తెలిసి దాచిన వారు, పెళ్లి చేసిన వాళ్లు కూడా చిక్కుల్లోపడక తప్పదన్నారు. రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలపై సమాచారం ఉంటే ప్రభుత్వ అధికారులకు లేదా పారా లీగల్ వలంటీర్లకు సమాచారం ఇవ్వడం బాధ్యతగా భావించాలన్నారు. దేశంలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకూడదనే ఉద్దేశంతో 'బాల్య వివాహ ముక్త్ భారత్' విస్తృతంగా నిర్వహిస్తున్నారన్నారు. బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. బాల్య వివాహాలపై సమాచారం ఉన్న వాళ్లు వెంటనే తహసీల్దారు, పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. తద్వారా ఆ వివాహాన్ని నిలిపివేయడం సాధ్యమవుతుందని, వారికి రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత, కలెక్టర్ ప్రశాంతి

## అంతర్ జిల్లా సైక్లింగ్ పోటీలకు 30, 1 తేదీల్లో క్రీడాకారుల ఎంపికలు

రాజమహేంద్రవరం అర్బన్/కాకినాడ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా సైక్లింగ్ పోటీలు, జిల్లా జట్టు క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 30, డిసెంబరు 1 తేదీల్లో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడంలోని గుడ్‌రోల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నిర్వహిస్తున్నట్టు తూర్పు గోదావరి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి డీఎంఎం శేషగిరి, కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల సైక్లింగ్ క్రీడాకారులు తమ సైక్లింగ్ ఎక్విప్‌మెంట్‌తో మందడంలో 30వ తేదీ ఉదయం రిపోర్టు చేయాలని సూచించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను డిసెంబరు 7 నుంచి 10వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరీలో జరిగే 29వ జాతీయ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌కు పంపిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు సైక్లింగ్ కోచ్ వెంకటరావు (గుంటూరు) 9849379932, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (గుంటూరు) 9703092077 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## నేటి నుంచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

కాకినాడ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా సమాఖ్య కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. కాకినాడ డీఎస్ఏ మైదానంలో అండర్-17 బాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు చేరుకున్నారని, వారికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.



చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న విధు శేఖర భారతీ స్వామి, భక్తులకు అనుగ్రహభాషణ

## ధర్మాచరణతోనే శ్రేయస్సు

**శృంగేరీ జగద్గురు విధు శేఖర భారతీ మహా స్వామి**

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'శ్రేయస్సు కావాలనుకుంటే ధర్మం పాటించాలి.... కష్టాలు వద్దనుకుంటే అధర్మాన్ని పరిత్యజించాలి... ధర్మం, అధర్మంతోనే సుఖదుఃఖాలు ఉంటాయి. కర్మానుసారం వాటిని అనుభవిస్తారు' అని శృంగేరీ జగద్గురు విధు శేఖర భారతీ మహాస్వామి ఉద్బోధించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టున వున్న త్యాగరాజ నారాయణదాస సమితి ప్రాంగణంలోని శ్రీశృంగేరి శంకర మఠంలో బుధవారం రాత్రి జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఆధునిక కాలంలో అనేక సౌకర్యాలు పెరిగాయి. విజ్ఞానం పెరిగింది కదా. ఇపుడు కూడా సనాతన ధర్మం అదీ ఇదీ అంటూ అవసరమా అని కొందరు అడుగుతుంటారు. వారికి నేనొక్కటే చెప్తాను. సౌకర్యాలు, టెక్నాలజీ పెరిగిన మాట వాస్తవమే. మహానుభావులు ఎవరో యంత్రాలు కనిపెడితే చాలా మంది అనుభవిస్తున్నారు. అయినా ప్రపంచంలో దుఃఖం అనేది తగ్గలేదు. వేరే మార్గాల్లో దుఃఖం వస్తుంది. సుఖమూ ఉందన్నారు. గతంలో లేని రోగాలు, మనకు పేరు కూడా తెలియని రోగాలను వింటున్నామన్నారు. సౌకర్యాల వల్ల దుఃఖం నివారించినా, మరో రూపంలో వస్తుందని విశదీకరించారు. దేవుడిచ్చిన మేరకు కష్టపడి సంపాదించుకుని అనుభవించాలి. సంపాదించింది అనుభవించకపోతే ఉపయోగం లేదు. అదే సమయంలో ధర్మ పాలనా ఉండాలని బోధించారు. ఇవి రెండూ జరిగితేనే హాయిగా ఉంటుందన్నారు. మనిషికి ధర్మమార్గం అత్యంత ఆదర్శం. సనాతన ధర్మం గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలి. ప్రతి విషయం వెనుక ఓ కారణం కచ్చితంగా ఉంటుంది. అన్నీ అర్థం చేసుకునే సామర్థ్యం మనుకు లేకపోవచ్చు. పూర్వమే రుషులు వాటి సారాన్ని మనకు అందించారని వివరించారు. ప్రతి మనిషికీ జిజ్ఞాస ఉండాలని, వితండ వాదన మంచిది కాదని జిజ్ఞాసతో ప్రశ్నించి గొప్పతనం తెలుసుకోవాలన్నారు.

**రాజమహేంద్రవరం కల్చరల్ (ఆంధ్రజ్యోతి):** విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామి త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ప్రాంగణంలో చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్వత్సభ జరిగింది. పండితుల వేద ఘోషతో ఆ ప్రాంగణం ప్రతిధ్వనించింది. శతావధాని గన్నవరపు లలితాదిత్యచే అష్టావధానం రసవత్తరంగా సాగింది. పృచ్ఛకులుగా కడిమెళ్ల వరప్రసాద్, ఆచార్య శలాక రఘునాథ శర్మ, ధూళిపాళ మహదేవమణి, పాలపర్తి శ్యామలానంద, తాతా సందీప్ శర్మ, ఆకెళ్ళ బాలభాను పాల్గొనగా సంచాలకర్తగా మల్లాప్రగడ శ్రీమన్నారాయణ వ్యవహరించారు.


అష్టావధానాన్ని వీక్షిస్తున్న విధు శేఖర భారతీ స్వామి



ఎంపికైన అనన్య, ఎం.ఝాన్సీశ్రీ

## జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఐ.పోలవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగం సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం హైస్కూలు విద్యార్థినులు హెచ్.అనన్య, ఎం.ఝాన్సీశ్రీ ఎంపికైనట్టు హెచ్ఎం సలాది వెంకటనారాయణ తెలిపారు. చిత్తూరు జిల్లా అరకొండలో జరిగిన పోటీల్లో వారి ఎంపిక జరిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను, పీడీ కళావతి, పీఈటీ అడ్డగళ్ల రామ్‌ప్రసాద్‌ను పీఎంసీ చైర్మన్ బసవా అప్పారావు అభినందించారు.

## మనాలీ పర్వతారోహణలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల విద్యార్థులు

రాజానగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మనాలీలో నిర్వహించిన పర్వతారోహణలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అయిన ఎంబీబీఎస్ విద్యార్థులు ముళ్లపూడి చైతన్యరాజ్, కస్నేటి హర్ష పాల్గొని కోర్సు సీనియర్ హోదా అందుకున్నారని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వాటి మాధవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ సంస్థ ఇటీవల మనాలీలో నిర్వహించిన సాహసోపేతమైన పర్వతారోహణలో దేశవ్యాప్తంగా ఎంపికైన 90 మంది విద్యార్థు లు పాల్గొనగా అందులో ఏపీకి చెందిన 10 మంది వున్నారన్నారు. తమ కళాశాలకు చెందిన చైతన్యరాజ్ దేశవ్యాప్తంగా ఉన్న రోప్‌లీడర్లు, వలంటీర్లకు నాయకత్వం వహించి కోర్సు సీనియర్ హోదా అందుకున్నాడన్నారు. సాహసికులను జీఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కే మిశ్రా అభినందించారు.


చైతన్యరాజ్, హర్షలను అభినందిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ సందీప్

# అన్నవరం దేవస్థానం ఈవోగా త్రినాథరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో త్రినాథరావు

అన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా వేంద్ర త్రినాథరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సత్యదేవుడిని దర్శించుకోగా ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనివేటి మండపంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కార్యాలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై తొలిసంతకం చేశారు. గతంలో రెండు పర్యాయాలు ఈవోగా ఆయన అన్నవరంలో బాధ్యతలు నిర్వహించారు.

## రామచంద్రమోహన్‌కు వీడ్కోలు

గతేడాది కార్తీకమాసంలో అన్నవరం ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రమోహన్ దేవదాయశాఖ ప్రధాన కార్యాలయానికి వెళ్లడంతో ఆయనకు బుధవారం దేవస్థానం ఉద్యోగులు వీడ్కోలు సభ ఘనంగా చేపట్టారు. ఈ ఏడాది కార్తీకమాసంలో గిరిప్రదక్షిణ నిర్వహణ, కార్తీకమాసంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చేపట్టిన చర్యలపై ఆయనను ప్రశంసించారు. రామచంద్రమోహన్ దంపతులను చైర్మన్ రోహిత్, నూతన ఈవో త్రినాథరావులు సత్కరించారు.


రామచంద్రమోహన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

# స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారుల పర్యటన


గొల్లప్రోలులో పరిశీలన చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారుల బృందం

గొల్లప్రోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు చెందిన అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యూనిట్ మేనేజ్‌మెంట్ అధికారుల బృందం బుధవారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో పర్యటించింది. సీనియర్ మేనేజర్ వంశీ, అసిస్టెంట్ మేనేజరు అనుప్రియ, ఆఫీసర్ రాహుల్‌రెడ్డి నగరపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశమై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. లిక్విడ్, సాలిడ్ వేస్ట్(విజువల్) మేనేజ్‌మెంట్ ట్రీట్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటుకు అనువైన స్థలాలను అధికారులతో కలిపి పరిశీలించి అనుకూలతలపై సర్వే నిర్వహించారు. రాష్ట్రంలో 93 మునిసిపాలిటీలు, నగరపంచాయతీలును వీటి ఏర్పాటుకు ఎంపిక చేయగా, అందులో గొల్లప్రోలు ఒకటి. ఇప్పటికే చెత్త సంపద కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు తెలిపారు. అధికారుల వెంట గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనరు రవికుమార్, తహశీల్దారు సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దారు సౌజన్య ఉన్నారు.

# భూ సమతుల్యత వైవిధ్యం కాపాడుకోవాలి

దివాన్‌చెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూ సమతుల్యత వైవిధ్యం కాపాడుకోవడం సమష్టి బాధ్యత అని సుభాష్ పాలేకర్ కృషి విధాన సాధకులు, ప్రచారకులు విజయరామ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులోని డీబీవీరాజు టౌన్‌షిప్‌లో గల శ్రీరాజేశ్వరీ కళ్యాణ మండపంలో భావితరాల కోసం గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయరామ్ మాట్లాడుతూ గ్రామీణ వికాసం కోసం ప్రస్తుతం మూస పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారన్నారు. దీని వల్ల భూతాపం పెరిగిపోతోందని చెప్పారు. అందువల్ల భూతాపం తగ్గించడంతో బాటు భూసమతుల్యతను కాపాడేపనిని చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా ఐదు అంచెల సాగువిధానం చేపట్టాలని చెప్పారు. ఇందులో అంతర్ పంటలు, దుంపలు, వంటివి ఉంటాయని ఒకసారి దున్నితే మళ్లీ భూమి దున్నవలసిన అవసరం ఉండదని చెప్పారు. అలాగే వెదురును సాగు చేసి చెంచాలు ప్లాస్టిక్ వస్తువులు స్థానే వెదురు చేసిన చెంచాలు వంటివివిధ వస్తువులు తయారు చేయవచ్చునన్నారు. ఈ విధంగా చేయడం, ఐదు అంచెలసాగు విధానం వల్ల ఎకరానికి వచ్చే ఆదాయం రూ.6 లక్షలకు పెరుగుతుందని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 24 వతేదీ వరకూ హైదరాబాద్ సమీపంలోని శాంతివనంలో పదివేలమంది రైతులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీజాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి కేంద్రబడ్జెట్‌లో రూ.2800 కోట్లు మంజూరుకు కేబినెట్ ఆమోదం కుడా లభించిందన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పుకు అనుగుణంగా వ్యవసాయ విధానంపై సదస్సు నిర్వాహకుడు అంబటిశివప్రసాద్ ప్రసంగించారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయరామ్

# మెగా పేరెంట్ మీటింగ్‌ని వాయిదా వేయాలి

## యూటీఎఫ్ వినతి


తూర్పుగోదావరి డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డిసెంబరు 7న నిర్వహించాలని నిర్ణయించిన మెగా పేరెంట్ మీటింగ్‌ని వాయిదా వేయాలని తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ నాయకత్వం కోరింది. ఈ మేరకు అధ్యక్ష, కార్యదర్శులు జయకర్, షరీఫ్ డీఈవో కె.వాసుదేవరావుకు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఆ రోజున సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినాన్ని గోదావరి జిల్లాల్లో ఘనంగా జరుపుకుంటారని, అందువల్ల ఆ రోజున జిల్లాలోని పాఠశాలలకు లోకల్ హాలిడే ఇవ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. ఒకవేళ పాఠశాల నిర్వహించినా విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉంటుందన్నారు. పైగా ఎన్నికల కోడ్ 10వ తేదీ వరకూ అమలులో ఉంటుందన్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని ఏలూరు, పశ్చిమ, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని 10వ తేదీ తర్వాత నిర్వహించాలని వారు అభ్యర్థించారు.

### ఒకే కుటుంబానికి చెందిన...

# ముగ్గురు ఆత్మహత్యాయత్నం

## హోటల్ ప్రారంభించి నష్టాలు రావడంతో పురుగుల మందు తాగిన బాధితులు


రాజమహేంద్రవరంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సంచనం రేపింది. ప్రకాశ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికానగర్‌లో సాయిశుభా అపార్ట్‌మెంట్ ఎస్3 ఫ్లాట్‌లో పాతూరి ఉపేంద్రకుమార్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. కొద్ది నెలల క్రితం ఎస్వీ రెస్టారెంట్ పేరుతో అదే ప్రాంతంలో ఓ హోటల్ ప్రారంభించారు. పెట్టుబడి, నిర్వహణ కోసం సుమారు రూ.40లక్షలు అప్పు చేశారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో.. అప్పులు తీర్చ లేమనే మనస్తాపం చెందారు. దీంతో కుటుంబ యజమాని పాతూరు ఉపేంద్రకుమార్, భార్య లక్ష్మీవిజయ, కుమారుడు సంతోశ్ బుధవారం ఉదయం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు తాగామని బాధితులు చెబుతున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాళ్లను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదం తప్పిందని, సురక్షితంగా ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అయితే ఆత్మహత్యాయత్నం కావడంతో ఎలాంటి పోలీసు కేసూ నమోదు కాలేదు.

# మీ చేతిలోనే.. మీ సేవ

- ఇక నిమిషాల్లో ఈసీ, సీసీ
- మీ సేవల ద్వారా సేవలు యథాతథం
- మధ్యవర్తుల ప్రమేయానికి చెక్
- గేట్ వేను అభివృద్ధి చేసిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం




పెద్దాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అందిస్తున్న పలు రకాల సేవలు ఇక మరింత సులభతరమయ్యాయి. ఇప్పుడు ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), సర్టిఫైడ్ కాపీ (సీసీ)ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. సగటు పౌరుడు సైతం నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సౌక ర్యాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆన్‌లైన్ విధానంలో అవసర మైన రుసుము, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు చెల్లిస్తే క్షణాల వ్యవధిలో ఆయా సేవలు పొంద వచ్చు. ప్రస్తుత ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమే యం ఉండబోదని అధికారులు చెబుతున్నారు. మీసేవా కేంద్రాల్లో ఈసేవలు అందుబాటలో లేవని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని అందులో ఎంతమాత్రం వాస్తవం లేదని చెబుతున్నారు.

## ఆన్‌లైన్ విధానంతో సత్ఫలితాలు..

గతంలో ఈసేవల పొందేందుకు ప్రతీ ఒక్కరూ మీసేవా కేంద్రానికి వెళ్లవలసి వచ్చేది. కొత్త ప్రభుత్వం ఈ శ్రమను సైతం తగ్గించా లని నిర్ణయించింది. ఫలితంగా అందుబాటు లోకి వచ్చిన ఆన్‌లైన్ విధానం సత్ఫలితాలను ఇస్తోంది. నిర్ణీత దరఖాస్తు నింపి దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లేదా మీసేవా తీసకెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇందుకోసం స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ తన వెబ్‌సైట్ ద్వారా చెల్లింపు గేట్‌వేను అభివృద్ధి పరిచింది. ఇది మంచి ఫలితాలను ఇవ్వడంతో ఈసీ,సీసీ కాపీలను తక్షణమే పొందగలిగే వెసులుబాటు లభించింది.

## గ్రామీణ ప్రాంతాల్లో కూడా..

ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేని గ్రామీ ణ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాల ద్వారా ఆయా కాపీలను అందుకోవచ్చు. దానికి ఎలాంటి పరి మితులు లేవు. గతంలో వీటికోసం మీసేవలో దరఖాస్తు చేశాక, అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని అక్కడ తగిన అనుమతులు పొందిన తరువాత మీసేవలో మాత్రమే డాక్యుమెంట్లను పొందగలిగేవారు. ఫలితంగా మితిమీరిన కాలయాపన జరిగేది. దరఖా స్తుదారు రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చే ది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా తక్కువ సమ యంలో డాక్యుమెంట్లు ప్రజలకు చేరనున్నాయి. గతంలో దరఖాస్తుదారు చెల్లించిన రుసుము మీసేవ విభాగానికి జమయ్యేవి. ఇప్పుడు నేరుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చేరనున్నాయి.

# నౌకలన్నీ బంద్..

- -కాకినాడ పోర్టులో ఒకటో నెంబర్ తుఫాను హెచ్చరిక జారీ
- -ఈనెల 30వరకు సముద్రంలో ఎక్కడి షిప్పులు అక్కడే..
- -ప్రస్తుతం కాకినాడకు బియ్యం, ఇతర కార్గో కోసం పది నౌకలు రాక
- -వీటిలో 8 నౌకల్లోకి సరుకు లోడింగ్ నిలిపివేత
- -సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బార్జిల రాకపోకలకూ రెడ్‌సిగ్నల్



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

నైరుతి బంగాళాఖాతంలో 'ఫెంగల్' తుఫాను హెచ్చరిక నేపథ్యంలో ఆ ప్రభావం కాకినాడ జిల్లాపైనా పడనున్నట్టు వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కాకినాడ పోర్టుకు ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ అయింది. దీంతో కాకినాడ పోర్టులో ఈనెల 30వరకు ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలను నిలిపివేశారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండం తుఫానుగా మరికొన్ని గంటల్లో మారనుండడంతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. బలమైన ఈదురుగాలులతో బలంగా కెరటాలు ఎగసిపడుతున్నాయి. దీంతో ఎక్కడికక్కడ నౌకల్లోకి కార్గో లోడింగ్‌ను నిలిపివేస్తూ పోర్టు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం కాకినాడ పోర్టుకు బియ్యంతోపాటు ఇతర కార్గో లోడింగ్, అన్‌లోడింగ్ కోసం పది నౌకలు వచ్చాయి. వీటిలో 2హోప్ ఐలాండ్‌కు సమీపంలో ఉన్నాయి. హోప్‌ఐలాండ్ వల్ల కొంత గాలుల తీవ్రత తక్కువగా ఉండడంతో వీటికి బుధవారం వరకు లోడింగ్ జరిగింది. మిగిలిన 8 నౌకలు దూరంగా ఉండడంతో వీటిని అక్కడే నిలిపివేయాలని ఆదేశాలిచ్చారు. ఈనెల 30 వరకు సముద్రంలోనే లంగరు వేయాలని సూచించారు. నౌకలకు కార్గోను తరలించే బార్జీల రాకపోకలను సైతం ఈనెల 30వరకు నిలిపివేశారు. మరోపక్క తుఫాను ప్రభావంతో ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. పెద్దఎత్తున అలలు బీచ్‌రోడ్డును తాకుతున్నాయి.

# నిరంతర కృషితో పోటీ పరీక్షల్లో గెలుపు

- తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్
- సివిల్స్ ఉచిత శిక్షణ స్క్రీనింగ్ పరీక్షకు 70 మంది హాజరు


సివిల్స్ స్క్రీనింగ్ పరీక్ష ఓఎంఆర్ షీట్‌ను కలెక్టర్ ప్రశాంతికి అందజేస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరంతర సాధన, కృషితోనే పోటీ పరీక్షల్లో గెలుపు సాధ్యమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష ప్రశ్నాపత్రం, ఓఎంఆర్ షీట్లను బీసీ వెల్ఫేర్ అధికారులతో కలసి కలెక్టర్ ఓపెన్ చేశారు. అనంతరం పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి మొత్తం 75 దరఖాస్తులు వచ్చాయని, స్క్రీనింగ్ పరీక్షకు 70 మంది హాజరయ్యారని అన్నారు. ఉత్తీర్ణులైన వారికి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో ఆరు నెలలపాటు ఉచితంగా శిక్షణ, స్టయిఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సివిల్స్ కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు పట్టుదలతో ప్రయత్నించి శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణను ఆర్డీవో కృష్ణనాయక్, బీసీ వెల్ఫేర్ అధికారిణి కేఎస్ జ్యోతి, సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సత్యరమేష్, ఇతర అధికారులు పరిశీలించారు.

# పింఛన్‌దారుడు మరణిస్తే..నెల రోజుల్లోనే భార్యకు పింఛన్

## కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయం

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పింఛన్‌దారులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి ముందుగా ఇచ్చిన హామీ మేరకు నెలకు పింఛను రూ.4వేలకు పెంచారు. 3నెలలకు అదనంగా రూ.3వేలు కలిపి మొత్తం రూ.7వేలను పింఛన్‌గా అందజేశారు. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం మరో ప్రకటన విడుదల చేసింది. పింఛనుదారుడు మృతి చెందితే నెలరోజుల్లోనే అతడి భార్యకు వితంతు పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపింది. దీంతో పింఛన్ తీసుకుంటూ ఏ వ్యక్తి అయినా మృతిచెందినా మరణానంతరం భార్య జీవనానికి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఆమెకు వితంతు పింఛను అందేలా తీసుకున్న ప్రభుత్వం నిర్ణయంపై డీఆర్‌డీఏ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సారథ్యంలో ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మార్గదర్శకాలు ఇవే....

ఎన్టీఆర్ భరోసా పింఛనుదారుడు మరణిస్తే భార్యకు వెంటనే ప్రభుత్వం వితంతు పింఛను మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెన్షన్‌దారుడు నవంబరు 1 తర్వాత మరణిస్తే మరణ ధ్రువీకరణ పత్రాన్ని పింఛన్‌దారుడి భార్య నవంబరు 15లోపు, గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేస్తే ఆమోదం పొందిన తరువాత డిసెంబరు 1 నుంచి వితంతు పింఛన్ మంజూరు చేస్తారు. ఇప్పటికే కాకినాడ జిల్లాలో వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి 1,38,249మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా ఇప్పటికే రూ.41,47,47,000 నగదును పంపిణీ చేస్తున్నారు. ఒకవేళ నవంబరు 15 తర్వాత అందజేస్తే 2025, జనవరి 1 నుంచి వితంతు పింఛన్ మంజూరు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీరపాండ్యన్ జారీ చేసిన ఉత్తర్వులు జిల్లా కార్యాలయాలకు అందాయి.

# కోటి దీపోత్సవం

కార్తీక మాసం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరి గట్టున గల సరస్వతీఘాట్ వద్ద బుధవారం సాయంత్రం కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించారు.
- రాజమహేంద్రవరం కల్చరల్




సరస్వతీఘాట్ వద్ద మెట్లపై వెలిగించిన దీపాలు, శివలింగానికి అలంకరణ దృశ్యాలు

# స్కూటీని ఢీకొన్న బస్సు

## ఇంటర్ విద్యార్థిని మృతి


మృతిచెందిన రూపాదేవి

కడియం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన విద్యార్థిని మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేమగిరితోటకు చెందిన పితాని రూపాదేవి (17) రాజమహేంద్రవరంలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. రూపాదేవి మేనత్త కల్లా దుర్గ కూడా డిగ్రీ పరీక్షలు రాసేందుకు రాజమహేంద్రవరం వెళ్తుంది. ఈ నేపథ్యంలో కల్లా దుర్గ, పితాని రూపాదేవి ఇద్దరూ స్కూటీపై బయలుదేరారు. వేమగిరితోట నుంచి రాజమహేంద్రవరం వెళ్తూ సెంటర్ వద్ద వారి స్కూటీని రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న ఆదిత్య కళాశాల బస్సు ఢీకొంది. దీంతో స్కూటీతో సహా ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. స్కూటీ వెనుక కూర్చున్న రూపాదేవి మీద నుంచి బస్సు చక్రాలు వెళ్లిపోయింది. గాయాలపాలైన ఇద్దరిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దుర్గకు గాయాలవ్వగా, రూపాదేవి చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భార్యపై భర్త హత్యాయత్నం

## చాకుతో దాడి


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జయలక్ష్మి

ఎటపాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం తెల్లవారుజామున అల్లూరి జిల్లా ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ ఎర్రబోరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రబోరు గ్రామానికి చెందిన బొగ్గా జయలక్ష్మీకి బొగ్గా రామకృష్ణతో పదకొండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే 8 నెలలుగా భార్యభర్తలు విడిపోయి దూరంగా ఉంటున్నారు. జయలక్ష్మి పుట్టిళ్ల అయిన ఎర్రబోరు గ్రామంలో ఉంటుంది. ఈక్రమంలో రామకృష్ణ బుధవారం తెల్లవారుజామున భార్య ఇంటికి వచ్చి గొడవపడి చాకుతో భార్య కాళ్లపై దాడి చేశాడు. జయలక్ష్మి కేకలు వేయడంతో అక్కడ నుంచి రామకృష్ణ పరారైయ్యాడు. వెంటనే జయలక్ష్మిని గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తరలించారు. గాయం కారణంగా 4కుట్లు వేశారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

# అధిక జీతం ఆశ చూపి మోసం

## గల్ఫ్ ఏజెంట్లపై కేసు నమోదు

రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధిక జీతం ఆశచూపి మస్కట్ పంపి తన సోదరిని ఇద్దరు ఏజెంట్లు మోసగించారంటూ బాధితురాలి తమ్ముడు యండ్ర శివగణేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్‌ఐ బుజ్జిబాబు బుధవారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన మేకా గంగా భవానికి మస్కట్‌లో అధిక జీతం వస్తుందని నమ్మించి గండి జయసుధ, సాదే నరేంద్ర అనే ఇద్దరు గల్ఫ్ పంపారు. గల్ఫ్‌లో గంగాభవాని ఆరోగ్యం బాగోలేక పోవడంతో ప్రస్తుతం స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఏజెంట్లకు కొంతమొత్తం ఇచ్చినా ఇండియాకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయకుండా వారు మోసగించినట్టు బాధితురాలి సోదరుడు శివగణేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

# నేడు సత్యదేవుడి సన్నిధికి భారతీ స్వామి రాక

అన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి గురువారం శృంగేరీ పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి విచ్చేయనున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామీజీ సాయంత్రం 5గంటలకు సత్యదేవుని దర్శించి తిరిగి రాజమహేంద్రవరం పయనమవుతారని వారు చెప్పారు.

# భలే ఉంది..బుల్లి దూడ

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో పుంగనూరు రైతు రెడ్డి సత్తిబాబుకు చెందిన పుంగనూరు ఆవుకు కేవలం 12 అంగుళాల ఎత్తులో పెయ్యి బుల్లి దూడ జన్మించింది. సాధారణంగా పుంగనూరు దూడలు 15నుంచి 18అంగుళాలు ఎత్తు ఉంటాయి. ఇంత తక్కువ ఎత్తులో పుట్టడం అరుదుగా జరుగుతుంటాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు. పుంగనూరు దూడను రైతులు, పశుప్రేమికులు ఆసక్తి తిలకిస్తున్నారు.



### 'మహిళలు సంఘటితం కావాలి'

తాళ్లరేవు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు సంఘటితమై హింసలను ఎదుర్కోవాలని బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అన్నారు. బుధవారం తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలిసభ్యులు తాళ్లరేవు పురవీధుల్లో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఉమెన్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఝాన్సీ ఉన్నారు.

# రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి

## కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రక్తదానాన్ని సామాజిక అవసరంగా భావించి, రక్తదానం చేసి నిరుపేదల ప్రాణాలు కాపాడాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. గిరిజనులకు సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, వారి ప్రాణాలకు భరోసా కల్పించే లక్ష్యంతో బ్లడ్ బ్యాంకు ప్రారంభించినట్టు సెలీన్ సోషల్ వెల్ఫేర్ సంస్థ వ్యవస్థాపకురాలు సెలీన్ తెలిపారు. బుధవారం రమణయ్యపేట శ్రీకన్వెన్షన్‌లో సెలీన్ సోషల్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకు శిబిరాన్ని ఎమ్మెల్యే నానాజీ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానంపై పెద్ద ఎత్తున యువతకు అవగాహన కల్పించి, రక్తదానంలో భాగస్వామ్యం కల్పించ డం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో రక్తం అవసరం ఎంతో ఉందని, వేసవిలో మరింత అవసరం ఉంటుందన్నారు. అత్యవసర, ప్రాణాంతక సమయంలో గిరిజనుల ప్రాణాలకు రక్తం అందించి ప్రాణాల కాపాడటమే తమ సంస్థ ధ్యేయమని సెలీన్ అన్నారు. రక్తదానం చేసిన 202 మంది వలంటీర్లకు రూ.1 లక్ష ప్రమాద బీమా పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జవహర్, డాక్టర్ పద్మ నళిని, డాక్టర్ త్రిష ప్రసాద్, డాక్టర్ రాణి, డాక్టర్ గిరి, బీజేపీ స్టేట్ మోర్చా ప్రెసిడెంట్ కురగంటి బాతీష్ ఉన్నారు.

### ఎమ్మెల్యే నానాజీకి సత్కారం

ఏపీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, ఏపీ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాశ్‌గౌడ్ బుధవారం గొడారిగుంటలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ డైరెక్టర్లుగా తమ ఎంపిక కోసం కృషి చేసిన ఎమ్మెల్యే నానాజీకి పూలబొకే ఇచ్చి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతలను గుర్తించి ప్రజలకు పారదర్శంగా సేవలు అందిదామని ఎమ్మెల్యే కోరారు. కార్పొరేషన్ల డైరెక్టర్లుగా ఆ సామాజికవర్గాల ప్రజలకు ప్రభుత్వ ఫలాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

## ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రవీణ



కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ, పిఠాపురంలో ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కొత్తపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి సమర్థవంతంగా బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.ప్రవీణ కోరారు. బుధవారం కొత్తపల్లి మండల కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర్ వికాసం, బాల్య వివాహాల నిరోధక చట్టంపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత జిల్లా లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లాలో ఇంకా 26 శాతం మేర అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలు, మేనరిక వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో బాల వివాహ నిరోధక చట్టం, బాల్య వివాహాల నిరోధక కమిటీలపై అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా బాలల రక్షణ అధికారి వెంకట్, హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు బాలలపై లైంగిక దాడులు, పోక్సో చట్టం, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, తహశీల్దార్ చిన్నారావు, సీడీపీవో దుర్గాదేవి, పీఆర్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### 'ఆశలను చిదిమివేస్తున్నాయి'

సామర్లకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చిన్నారుల విద్య, జీవన అవకాశాలను, ఆశలను చిదిమివేసి వారి ఆరోగ్యాన్ని, హక్కులను దెబ్బతీస్తాయని సీనియర్ మహిళా న్యాయవాది కొర్లమండ శ్రీవాణీ ఆందోళన వ్యక్తం చేశారు. బాల్యవివాహాల నిరోధక దినోత్సవం పురస్కరించుకుని సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహనా సదస్సు జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా న్యాయవాది శ్రీవాణీ మాట్లాడుతూ బాల్యవివాహాల నిషేధ చట్టాన్ని అమలు చేయాల్సిందేనన్నారు. జిల్లా మానవ హక్కుల పరిరక్షన సంఘ అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, ఉపాధ్యాయులు డీవీఆర్ఎన్ వల్లీ, జీ.గోవిందు, ఏఎల్వీ.కుమారి, జుత్తుక అప్పారావు, ఎస్ఏ. రెహ్మాన్, ఎండీ వల్లీబాషాలు ప్రసంగించారు. సామర్లకోట మండల డ్వాక్రా సంఘాలు, ఐసీడీఎస్ సిబ్బంది సంయుక్తంగా స్త్రీశక్తి భవనం నుంచి పెద్దఎత్తున అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం, జగదీశ్వరి, ఎంపీడీవో హిమమహేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు మంగల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో డ్వాక్రా సీసీఏస్‌లు, వీవోఏలు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

### 'బాల్య వివాహాలు నేరం'

పిఠాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం లేదా ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని,వాటితో పలు అనారోగ్య సమస్యలు వస్తాయని, వాటికి దూరంగా ఉండాలని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర వైద్యాధికారి డాక్టర్ జయరాం సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన, కిశోర వికాసం, లైంగిక వేధింపులు, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ తదితర అంశాలపై అవగాన కల్పిస్తూ పిఠాపురంలో బుధవారం వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. చిన్నవయస్సులోనే వివాహాలు జరపడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### కొవ్వొత్తుల ప్రదర్శన

పెద్దాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహ రహిత భారత్ లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, ఎంపీడీవో శ్రీలలిత అన్నారు. బాల్య వివాహ భారత్ ప్రచారంలో భాగంగా స్థానిక మున్సిపల్ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో ఉష, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు చంద్రకళ, బేబీ, నిర్మల, మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

### రగ్బీ పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

పిఠాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పట్టణంలోని బాదం మాదవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన అండర్ 17 పోటీల్లో పాఠశాల విద్యార్థులు దొడ్డి భాను, మణి రాజేశ్వరీ పాల్గొని ప్రత్యేక బహుమతులు సాధించారు. వారిని పాఠశాల హెచ్ఎం, ఎంఈవో శ్యాంబాబు, పీడీ శేషుకుమారి, సత్యప్రియలు అభినందించారు.

### పంటకాలువలో మెరక దిబ్బలు తొలగింపు



తాళ్లరేవు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలేకుర్రు-గాడిమొగ పంటకాలువలో సాగు నీరు శివారు భూములకు అందించేందుకు కాలువలో మెరకదిబ్బలను బుధవారం ఎక్సొకవేటర్‌తో తొలగించారు. పోలేకుర్రు నీటిసంఘం మాజీ అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణరాజు సొంతఖర్చులతో ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో రైతులకు రెండోపంటకు సాగునీరు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. తాళ్లరేవు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం నుంచి గాడిమొగ వరకు కాలువలో దిబ్బలను తొలగించి కాలువగట్టుపై వేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ కాంట్రాక్టు వర్కర్లు పాల్గొన్నారు.

### స్థల ఆక్రమణపై ఫిర్యాదు

తాళ్లరేవు, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట సర్వేనెం. 85/3 ఇంటిస్థలాన్ని వైసీపీ కార్యకర్త సమ్మిడి వీర్రాజు ఆక్రమణ చేసి అమ్మకం పెడుతున్నారని స్థానికుడు కొల్లాటి నరసింహారావు దంపతులు తహశీల్దార్ పి.త్రినాధరావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. స్థలం ఆక్రమణపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో ప్రభుదాస్‌లను తహశీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వనమాడి వెంకటరమణ, రాంబాబు, వడ్లమూరి సతీష్, జక్కల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలి

## డీఏవో విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో

పెద్దాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇంకా కోతలు ప్రారంభించని రైతులు వరి కోతలను 2,3 రోజులు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రం ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులను చైతన్యపరిచి సేంద్రియసాగు చేసే దిశగా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నల్లి దైవకుమార్, ఏవో సంజయ్‌కుమార్, ఏఈవో ప్రసాద్, రాగ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

# 'రైతులు పంట ఉత్పత్తులను రక్షించుకోవాలి'

కరప, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉంటూ తుఫాను బారిన పడకుండా తమ పంట ఉత్పత్తులను రక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి అప్పసాని వెంకటరాజేష్, తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ సూచించారు. కరప, కొరుపల్లి, జడ్.బావారం, తదితర గ్రామాల్లో బుధవారం వారు పర్యటించి రైతులకు పంట కోతలు, ధాన్యం రాశులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పనల మీద ఉన్న, కళ్లాల్లో ఉన్న పంటను సురక్షిత ప్రాంతాలకు చేరవేయాలని, ధాన్యం రాశులు తడిచిపోకుండా బరకాలతో కప్పాలని సూచించారు. కొత్త వంగడం ఎంటీయూ-1318 రకం పంటను ఇంకా కోయవద్దని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి బి.శ్రీరాములు, వీఏఏ తేజ, తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

## ఎమ్మెల్యే చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

పెద్దాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం స్థానిక సీహెచ్‌సీలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే రోగులకు అందే సేవల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి తగిన చర్యలను చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ సతీష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు పాల్గొన్నారు.

మండలంలోని కట్టమూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మేడిది శ్రీనివాస్ మాతృమూర్తి అనంతలక్ష్మీ (70) ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆయనను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. ఏలేటి సుబ్బారావు, సత్తిబాబు, అడపా గంగాధరం, దిబ్బిడి రాజబాబు, బొడ్డు బాబూరావు తదితరులు ఉన్నారు.

### 208 మందికి కళ్లజోళ్లు పంపిణీ

సర్పవరం జంక్షన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గొడారిగుంటలో రూ.1 లక్ష విలువ చేసే కళ్లజోళ్లను 202 మందికి ఎమ్మెల్యే పంతం నానాజీ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన 4వ కార్తీక వనసమారాధనలో అంజు ఐకేర్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల్లో 208 మందికి కళ్లజోళ్లు అవసరమని డాక్టర్లు గుర్తించడం జరిగిందన్నారు. వీరికి అవసరమైన కళ్లజోళ్లను తదేకం ఫౌండేషన్ లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. తాటికాయల వీరబాబు, శిరంగు శ్రీనివాసరావు, నూకల నారాయణరావు, సీతయ్యదొర, శాండీ, జీని శ్రీనివాస్, దాసరి శివ, పోసిన రాము, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో విశేష కార్తీక పూజలు



స్వామి, అమ్మవార్ల అలంకరణలు, జ్యోతిర్లింగార్చన పూజలు

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని బుధవారం సామర్లకోట కుమార రామభీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున గోపూజ నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా, రాష్ట్రం నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. పోలీసులు, వివిధ భక్తసంఘాల ప్రతినిధులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామి,అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో పిఠాపురం ఆలయ కార్యనిర్వహణాధికారిణి సౌజన్యప్రభాకర్ దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశ దీప పూజలో సౌజన్యప్రభాకర్ దంపతులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. కార్తీక దీపారాధన సంఘ సభ్యులు నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో 800మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. బుధవారం రాత్రి ఆలయానికి విచ్చేసిన 400మంది భక్తులకు సామర్లకోట లయన్స్ భీమేశ్వరా క్లబ్ సౌజన్యంతో చక్కెర పొంగలి, పులిహోర అల్పాహారం, వాటర్‌ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈసేవలో చిత్తులూరి రాజా, ఈదర ఈశ్వర్‌కుమార్, అమలకంటి శ్రీనివాస రావు, గుండు శంకరరావు, మద్దిరాల శివనాగకృష్ణ, మాజేటి కృష్ణ, మేకా శ్రీను, కర్రి ఆదినారాయణ రెడ్డి, కానుబోయిన విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐడియల్ కళాశాలతో ఒడిగోస్ ఒప్పందం



ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న ఐడియల్, ఒడిగోస్ ప్రతినిధులు

కాకినాడరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాలతో ఒడిగోస్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. కార్యక్రమానికి కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి జీవన్ కాంత్ అధ్య క్షత వహించగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, అకడమిక్ డైరెక్టర్స్ మెర్ల రంజిత్, వాసు, వైస్ ప్రిన్సిపాల్ కామరాజు, ఒడిగోస్ మేనేజింగ్ డైరెక్టర్స్ వార వినోద్, సత్యనారాయణ పాల్గొని అవగాహనా ఒప్పంద పత్రాలను ఒకరికొకరు మార్చుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంఓయూ కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులకు శిక్షణనిచ్చి వారికి ఉద్యోగాలను కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని ఒడిగోస్ డైరెక్టర్స్ తెలిపారు. విద్యార్థులు సరైన పద్ధతిలో శిక్షణ తీసుకుంటే 4నెలల్లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ సాధించవచ్చన్నారు. ఒడిగోస్ ఫౌండర్ మేరీజ్యోతి, మేనేజర్లు శిరీషా,లారా, సమన్వయకర్తలు మౌళిక, రామ, పద్మ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలి



పిఠాపురం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి సూచించారు. కుమారపురం, మంగితుర్తి, జల్లూరు, పి.రాయవరం తదితర గ్రామాల్లో ఆమె బుధవారం పర్యటించారు. ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా మిల్లులకు లేదా కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. కోతలు, మాసూళ్ల వాయిదా వేసుకోవాలని చెప్పారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి అచ్యుతరావు ఉన్నారు.

### జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల ర్యాలీ

ఏలేశ్వరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నింపేట గ్రామంలో ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలంటూ కార్మికులు ఏలేశ్వరం మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ చేపట్టారు. వారికి సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 400 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్న ఫ్యాక్టరీని అర్ధంతరంగా మూసివేయడంతో ఆయా కుటుంబాలు రోడ్డునపడ్డాయన్నారు. ప్రతి కార్మికుడికి రూ.2లక్షలు పరిహారంతో పాటు పీఎఫ్, ఇతర అలవెన్సులను యాజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

# చేబ్రోలుకు చేరుకున్న పాదయాత్ర



పల్లం నుంచి అన్నవరం పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు చేబ్రోలులో భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అన్నవరం వరకూ భక్తులు నిర్వహిస్తున్న పాదయాత్ర బుధవారం రాత్రి చేబ్రోలు చేరుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పల్లం గ్రామం నుంచి అన్నవరం వరకూ ఏటా పాదయాత్ర నిర్వహిస్తారు. కోలా మీరయ్య గురుస్వామి ఆధ్వర్యంలో ప్రారంభమైన పాదయాత్ర 8వ రోజు పిఠాపురం, గొల్లప్రోలు మీదుగా చేబ్రోలు చేరుకుంది. వీరికి అక్కడ నక్కా తాతీలు, గవర్రాజు కుటుంబసభ్యులు భోజన వసతి సదుపాయాలు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం తిరిగి పాదయాత్ర ప్రారంభించి అన్నవరం చేరుకుంటారు.

### బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.మిర్తివాడలో ఎక్సైజ్ సిబ్బంది సారా బట్టీలపై దాడులు చేసి 1,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ డి.శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యం తాగి వాహనాలు నడిపిన 10మందిపై కేసులు

కాకినాడ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 10మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి జైలుశిక్ష, నలుగురికి ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వాల్మీకి నరసింహ తీర్పు చెప్పారన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే ఉద్దేశ్యంతో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు.

### రక్తదాన శిబిరం

జేఎన్టీయూకే, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ఎన్‌సీసీ హెడ్ క్వార్టర్స్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జేఎన్టీయూకే ప్రాంగణంలోని ఎన్‌సీసీ 18వఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలు కళాశాలలు, జేఎన్టీయూకే, యూసీఈకే ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేయగా కార్యక్రమంలో పలువురు ఎన్‌సీసీ అధికారులు, రెడ్ క్రాస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

### రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి



గొల్లప్రోలు ఎమ్మార్సీలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఈవో కార్యాలయ ఏడీ శ్రీరామ్

గొల్లప్రోలు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలలతో పాటు ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని డీఈవో కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టరు దర్భా శ్రీరామ్ సూచించారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా గొల్లప్రోలు మండల వనరుల కేంద్రంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో నాయుడు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### రాజుపాలెంలో వనసమారాధన

కిర్లంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం కృష్ణుని ఆలయ ప్రాంగణంలో బుధవారం గణేశుల బ్రదర్స్ ఆధ్వర్యంలో బుధవారం వన సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఉసిరి చెట్టు వద్ద పూజలు చేసి అన్నప్రసాదం స్వీకరించారు.

# గ్రామసభల అర్జీలకు 60శాతం పరిష్కారం



తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహించిన 17 రీసర్వే గ్రామసభల్లో రైతుల నుంచి 620అర్జీలు స్వీకరించామని బుధవారం తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నా రు. ఈసందర్భంగా తహశీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ బుధవారం సాయంత్రానికి 354 అర్జీలు పరిష్కరించామన్నారు. మిగిలిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అత్యధికంగా పెదబ్రహ్మదేవంలో 98అర్జీలు, అత్యల్పంగా పండ్రవాడ గ్రామం నుంచి కేవలం 9అర్జీలు వచ్చాయన్నారు. మ్యూటేషన్లు సరిచేయుట, సర్వే నంబర్ల మార్పు లు, జాయింట్ ఎల్పీఎం సబ్‌డివిజన్, విస్తీర్ణం వ్యత్యాసం, భూవాస్తవ స్థితి మార్పులు, మొబైల్ నంబరు సీడింగ్, ఆధార్ సీడింగ్, వంటి సమ స్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించామని తహశీల్దార్ చెప్పారు. డీటీ వై.శ్రీనివాస్, వీఆర్వోలు నూతలపాటి లోవరాజు, నాగేశ్వర రావు, పద్మనాభం, మామిడాల కామరాజు, కెవీవీ. శ్రీను, నలజర్ల మురళీకృష్ణ ఉన్నారు.

# సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

## జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ప్రసాద్



వేళంగి ఎంఎల్ఎస్ పాయింట్‌లో స్టాకును పరిశీలిస్తున్న డీఎస్‌వో ప్రసాద్

కరప, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ఎంవీ ప్రసాద్ సూచించారు. వేళంగి ఎంఎల్ఎస్ పాయింట్‌ను బుధవారం ఆయన సందర్శించి బియ్యం, కందిపప్పు, పంచదార స్టాకును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ నుంచి కరప, పెదపూడి, కాజులూరు మండలాల్లోని రేషన్ దుకాణాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని, పెదపూడిలోని ఇంకా 19షాపులకు డిసెంబరు నెల కోటా సరుకు అందజేయాల్సి ఉందని టీపీ ఎం.సౌందర్య తెలిపారు. పెనుగుదురు రైతు సేవా కేంద్రాన్ని డీఎస్‌వో ప్రసాద్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ఆరా దీశారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని, పనలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని సూచించారు.

### అప్రమత్తంగా ఉండాలి

ఏలేశ్వరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపర్తి, భద్రవరం గ్రామాల్లో కోత కోసిన వరి పంటను వ్యవసాయ అధికారి జ్యోతి బుధవారం పరిశీలించారు. తుఫాను నేపథ్యంలో పంటను కుప్పలుగా వేసుకోవాలని రైతులకు సూచించారు. కుప్ప నూర్చిన పంటను సురక్షిత ప్రదేశంలో బరకాలు కప్పి నిల్వ చేసుకోవాలన్నారు. వరి కోతలను కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలన్నారు.

## ఇంటింటా వైద్య సర్వే

కిర్లంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటింటా వైద్య సర్వే నిర్వహిస్తున్నట్టు కిర్లంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబునాయక్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం కిర్లంపూడి, రమణయ్యపేటల్లో సర్వే చేపట్టారు. ఏఎన్ఎం దేవి, ఎంఎల్‌హెచ్ పి.రమ్య, ఆశా వర్కర్లు ఎం.వీరలక్ష్మి, ఎస్.జ్యోతి, టి.శాంతి పాల్గొన్నారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం శివారులో ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోసిన దృశ్యం

## తుఫాను హెచ్చరికలతో రైతుల ఆందోళన

రాజవొమ్మంగి నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికలతో గిరిజన ప్రాంత రైతులు బెంబేలెత్తిపోతున్నారు. కష్టపడి పండించిన పంట నీట మునుగుతుందని బుధవారం పరుగులు పెడుతూ పొలాల్లో పనులు చేశారు. ముందుగా అప్రమత్తమై కోత కోసి ఆరబెట్టి ఉన్న ధాన్యాన్ని తరలించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చక్రధర్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన చెరుకుంపాలెం, జడ్డంగి గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని పొలాల నుంచే లారీల్లో తరలించారు.

**చింతూరు (ఆంధ్రజ్యోతి):** తుఫాన్ ప్రభావం చింతూరు మండలంలో కూడా ఉండి ఉండవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరి సాగు చేసిన రైతులు ఈ నెల 30 వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలన్నారు. పనల మీద ఉంటే వెంటనే కుప్పలు వేసి టార్పాలిన్లు కప్పాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

## 'బాల్య వివాహాలను నిర్మూలించాలి'

రంపచోడవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత అందరిపైనా ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 'బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి ఆయనతో పాటు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐటీడీఏ పీవో సింహాచలం మాట్లాడుతూ గిరిజన బాలికలకు ప్రభుత్వం ద్వారా ఉచిత విద్య, భోజన వసతి కల్పిస్తున్నామని, బాలికలు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు జీవితంలో మంచి భవిష్యత్ ఇచ్చేది విద్య మాత్రమేనని, ఆ దిశగా లక్ష్యాలను ఎంచుకుని సాధించాలన్నారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించి, బాల్య వివాహాల నిర్మూలన గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, తహసీల్దారు ఏఎస్ రామకృష్ణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ దొర, సీడీపీవో సంధ్యారాణి, ప్రిన్సిపాల్ ఎలీషా, అన్నమణి, బీఎస్ కమార్ పాల్గొన్నారు.




ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చింతూరు డివిజన్ పారిశుధ్య కార్మికులు

## 'పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

చింతూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ కోరారు. పారిశుధ్య కార్మికులు సీఐటీయూ నేతృత్వంలో తమ సమస్యలను పరిష్కరించాలన్న ప్రధాన డిమాండ్‌తో బుధవారం చింతూరులో ర్యాలీ జరిపి ఐటీడీఏ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లకు పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, కనీస వేతనం చెల్లించాలని, పనిభారం తగ్గించాలని, రాజకీయ వేధింపులు ఆపివేయాలని, ఏడాదికి రెండు జతల ఏకరూప దుస్తులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆరోగ్య రక్షణ నిమిత్తం మాస్కులు, గ్లౌజులు, షూస్ ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో చింతూరు ఐటీడీఏ ముందు ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యుడు కారం సుబ్బారావు, పారిశుధ్య కార్మికులు సురేష్, గాంధీ, వరలక్ష్మి, రజని, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రామదుర్గంలో భక్తుల పూజలు



దేవీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మాతృశ్రీ గండిపోశమ్మ, నేలకోట గ్రామ సమీపంలో ఎత్తైన కొండలపై ఉన్న శ్రీరామదుర్గం ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. బుధవారం ఇందుకూరుపేట, ఫజుల్లాబాద్, గోకవరం, కోరుకొండ, ఇందుకూరు-1 గ్రామాల నుంచి భక్తులు పాదయాత్రగా వెళ్లి రామదుర్గంలో ఉన్న శ్రీరాములు, శ్రీకృష్ణుడు, సీతమ్మతల్లి పసుపు-కుంకుమ కోనేరులను దర్శించుకున్నారు. వన భోజనాలు చేశారు. పాపికొండలు విహార యాత్రకు పర్యాటకులు పలు బోట్లలో మైదాన ప్రాంతాల నుంచి వెళ్లారు. పేరంటాలపల్లిలో శివాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు.

## 'బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యం'

చింతూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమాన్ని జన కల్యాణ్ వెల్ఫేర్ స్వచ్ఛంద సంస్థ, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా బుధవారం చింతూరులో నిర్వహించాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అధికారులు, మహిళలు, విద్యార్థినులు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. సీడీపీవో పి.విజయగౌరి, ఐటీడీఏ ఏవో రాజకుమార్, జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బి.నాగేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శేఖర్, ఐసీడీఎస్ పర్యవేక్షక అధికారులు సంఘమిత్ర, ప్రియాంక పాల్గొన్నారు.

## 3న సీపీఎం మండల మహా సభ

చింతూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్లేరులో డిసెంబరు 3న సీపీఎం తొమ్మిదవ మండల మహా సభ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ అన్నవరం మండల శాఖ కార్యదర్శి సీసం సురేష్ పేర్కొన్నారు. బుధవారం చింతూరు పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సమావేశంలో నాయకులు పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, మడివి రాజేష్, చైతన్య పాల్గొన్నారు.

### హుండీల ఆదాయం లెక్కింపు

రంపచోడవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐ.పోలవరం గోవిందగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీని బుధవారం టీటీడీ విజిలెన్స్ అధికారి జిమేదారు శ్రీనివాసులు పర్యవేక్షణలో తెరిచి లెక్కించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.8,04,500 ఆదాయం వచ్చింది. నారాయణరాజు, శివరామ్, శ్రీవారి సేవక బృందం కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు





ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో వరి పనలు తరలించే ఏర్పాట్లలో రైతులు, ఏలేశ్వరం మండలం భద్రవరంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో జ్యోతి

## అన్నదాతలకు వాయు'గండం'

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తమయ్యారు. పొలల్లో పనలపైన నూర్పిడి దశలో వున్న వరిని కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పడం, నూర్పిడి చేసిన ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కించి తరలించే పనుల్లో రైతులు తలమునకలయ్యారు. తహసీల్దారు సూర్యప్రభ, మండల వ్యవసాయాధికారి వైవీ గంగాధర్, వ్యవసాయ సిబ్బంది బుధవారం ప్రత్తిపాడు, పెదశంకర్లపూడి, పెద్దిపాలెం, ధర్మవరం గ్రామాల్లో పర్యటించి తుఫాను ప్రభావాన్ని వివరించి పంట నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

**కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి):** తుఫాను హెచ్చరికతో వరి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. ఇప్పటికే కోత కోసి ఉంటే వెంటనే కుప్పలు వేసుకోవాలంటున్నారు. భారీ వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశముండడంతో చేతికొచ్చిన వరి పంట నీటిపాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**రౌతులపూడి (ఆంధ్రజ్యోతి):** మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు సూచించారు. ఇప్పటికే కోసిన వరి చేలను కుప్పలుగా వేసుకోవాలన్నారు. కోతలు కోసి నూర్చిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రం అధికారులను సంప్రదించి రైసుమిల్లర్ల వద్దకు తరలించుకోవాలన్నారు.

**ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి):** మండలంలోని లింగంపర్తి, భద్రవరం గ్రామాల్లో కోత కోసిన వరి పంటను వ్యవసాయ అధికారి జ్యోతి బుధవారం పరిశీలించారు. తుఫాను నేపథ్యంలో పంటను కుప్పలుగా వేసుకోవాలని రైతులకు సూచించారు. కుప్ప నూర్చిన పంటను సురక్షిత ప్రదేశంలో బరకాలు కప్పి నిల్వ చేసుకోవాలన్నారు. వరి కోతలను కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలని, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని జ్యోతి కోరారు.



### జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల ర్యాలీ

ఏలేశ్వరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నింపేట గ్రామంలో ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలంటూ కార్మికులు ఏలేశ్వరం మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ చేపట్టారు. వారికి సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 400 కుటుంబాలు రోడ్డునపడ్డాయన్నారు. ప్రతి కార్మికుడికి రూ.2లక్షలు పరిహారంతో పాటు పీఎఫ్, ఇతర అలవెన్సులను యాజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

### బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రత్తిపాడు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మేజిస్ట్రేట్ కాటం భాను పేర్కొన్నారు. 'బాల్య వివాహాలు-ముక్తభారత్' అంశంపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ప్రసంగించగా సీనియర్ న్యాయవాదులు బుగతా శివ, బొంగులూరు మధుబాబు, అవసరాల దేవి, కోర్టు సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

## కలెక్టర్ పర్యటనపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్‌మోహన్ మండలంలో రెండు రోజుల్లో జరిపే పర్యటనపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దారు ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు మాట్లాడుతూ పెద్దిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని లంపకలోవ, రౌతుపాలెం, గోకవరం, వేములపాలెం, ఉత్తరకంచి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించే అవకాశం ఉందన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొని ఆయా గ్రామాల్లో సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడానికి సన్నద్ధం కావాలన్నారు. సమావేశంలో ఎంఈవో వి.రాజబాబు, ఏవో వైవీ గంగాధర్, వెలుగు ఏపీఎం వెంకట్, ఉపాధి ఏపీవో కుమార్‌స్వామి, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసీడీఎస్ అధికారులు వరలక్ష్మి, శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌లో అవకతవకలపై దర్యాప్తు



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న సహకార శాఖ అధికారులు

తుని రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో ఎస్.అన్నవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో జరిగిన పలు అవకతవకలపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. వైసీపీ సాను భూతిపరులు పెద్ద ఎత్తున సొమ్ములు లూటీ చేశారన్న ఆరోపణలతో కొద్ది కాలంగా సబ్ డివిజన్ సహకార అధికారి, ప్రత్తిపాడుకు చెందిన డీఎన్ శివకుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తుని మండలం, కోటనందూరు మండలం, పాయకరావుపేటతో పాటు రౌతులపూడి మండలాల్లో రైతుల వద్దకు వెళ్లి పొందిన రుణం, కట్టిన సొమ్ముపై వివరాలు సేకరిస్తున్నారు. శివకుమార్ మాట్లాడుతూ నెల నుంచీ జరుగుతున్న సమగ్ర విచారణ రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేస్తానని చెప్పారు.

## ఉప్పలపాడు, రాజుపాలెంల్లో కార్తీక వనసమారాధనలు

గండేపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు గ్రామ శివారున గల పామాయిల్ తోటలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కొత్త శివ, మల్లేపల్లి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. భారీ సంఖ్యలో ఆర్యవైశ్యులు హాజరై ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. మధ్యాహ్నం భోజనాలు చేసి సాయంత్రం వరకు కుటుంబ సమేతంగా ఆటపాటలతో గడిపారు. ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుడు బూర్లు సాయి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



గండేపల్లి మండలం ఉప్పలపాడులో...



కిర్లంపూడి మండలం రాజుపాలెంలో....

**ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ధర్మవరం ప్రతిభా విద్యాలయ అధినేత దాసం శేషారావు ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులు రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయాన్ని సందర్శించి ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామిని దర్శించి భజనలు, పాటలతో సందడి చేశారు. రమణ ఆశ్రమంలో కార్తీక భోజనాలు చేశారు. ప్రత్తిపాడులోని శ్రీరామనామ క్షేత్రం వద్ద లక్ష దీపోత్సవంలో 200 మంది మహిళలు పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామి నామాలు, శంఖు, చక్రాల ఆకారాల్లో దీపాలు వెలిగించారు.

**కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి):** మండలంలోని రాజుపాలెం కృష్ణుని ఆలయ ప్రాంగణంలో గణేశుల బ్రదర్స్ ఆధ్వర్యంలో బుధవారం వన సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఉసిరి చెట్టు వద్ద పూజలు చేసి అన్నప్రసాదం స్వీకరించారు.

## నాగ దేవత ఆలయం వద్ద పూజలు

జగ్గంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట-గుర్రంపాలెం రోడ్డులోని పుష్కర కాలువ గట్టుపై వెలసిన గణపతి, అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, నాగ దేవత ఆలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటుచేసిన వన సమారాధనలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఆయన వెంట సూరవరెడ్డి నరేష్, రాజనాల శ్రీను, మాదారపు వీరబాబు, గోకేడ ప్రసాద్, గంధం శ్రీనివాస్, కాయల మణికంఠ, పాలెం బాబీ ఉన్నారు.



### పోలీస్ స్టేషన్ తనిఖీ

కోటనందూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు పోలీస్‌స్టేషన్‌ను పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విశాఖ జిల్లా నుంచి గంజాయిపై ఇక్కడకు ఎక్కువగా వచ్చే అవకాశమున్న దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

### దహన సంస్కారాల ఖర్చులకు ఆర్థిక సాయం

ఎటపాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొమ్ముకోయగూడెం గ్రామంలో ఊయిక వసంత్, కృష్ణవరం గ్రామానికి చెందిన కూరం నారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. దహన సంస్కారాల నిమిత్తం ఆ రెండు కుటుంబాలకు జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పుట్టి రమేష్, నాయకులు కణితి మధు, దానే రాజు అందజేశారు. టీడీపీ నాయకులు గుత్తా వెంకన్న, తోటకూర రామారావు, ఊయిక రాము, తోటకూర రామారావు పాల్గొన్నారు.

**చింతూరు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నర్సింగపేటకు చెందిన దుమ్మిరి శేషు కుమారుడు జస్వంత్ (3) కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం జస్వంత్‌ని తెలంగాణలోని ఖమ్మంలో ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కాగా జస్వంత్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ దహన సంస్కారాలకు రూ.5వేలు ఆర్థిక సహకారం అందించింది. ట్రస్టు సభ్యులు ఎస్కే రియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### 'పోటు ప్రసాద్ మృతి తీరని లోటు'

చింతూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ బుధవారం మృతి చెందారు. ఆయన మృతి తీరని లోటని చింతూరు సబ్ డివిజన్ సహాయ కార్యదర్శి ఎస్కే రంజాన్, గుజ్జా మోహన్‌రావు పేర్కొన్నారు. ప్రసాద్ నిత్యం పేద ప్రజల పక్షాన పోరాటం చేసేవారన్నారు.



### వై.రామవరంలో చలి తీవ్రత

వై.రామవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో చలి తీవ్రత రోజురోజుకీ అధికమవుతోంది. మండలంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పగలు 20 డిగ్రీలు, రాత్రి 16 డిగ్రీలు నమోదవుతున్నాయి. ప్రజలు చలికి అల్లాడిపోతూ ఇంటికే పరిమితమవుతున్నారు. ఆరు బయట చలిమంట కాగుతూ ఉపశమనం పొందుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలు దాటినా మంచు వీడట్లేదు.

### 'ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి'

చింతూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన కోరారు. బుధవారం ఆమె నేతృత్వంలో పార్టీ నాయకులు చింతూరు ఐటీడీఏ ఏవోకి వినతిపత్రం అందజేశారు. కారం పొద్దయ్య, మడకం ఇర్మరాజు, మడకం భీమయ్య, చుక్కయ్య, కొమరం జగ్గయ్య, అడవి జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు శివపంచాయతన క్షేత్రం ప్రారంభం

గండేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకంపల్లిలో తత్వం చారిటబుల్ ట్రస్టు ద్వారా శివ పంచాయతన క్షేత్రంలో సువర్ణ భారతి గోశాల, సువర్ణ భారతి పాకశాల, సువర్ణ భారతి ప్రవచన మంటపం నిర్మించారు. గురువారం వీటిని శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి ప్రారంభిస్తారని ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస బంగారయ్యశర్మ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోదావరి జిల్లాలో పుణ్యస్థలాన్ని ఎంచుకుని ఏళ్ల నాటి రామాలయం చెంతనే ఈ క్షేత్రం నిర్మించినట్టు చెప్పారు. దేశం నలుమూలల నుంచి పెద్దలు, ప్రముఖులు, భక్తులు హాజరవుతారని, వారికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కొన్ని కారణాల వల్ల సీఎం చంద్రబాబు రాలేకపోతున్నారన్నారు. విలేకరుల సమావేశంలో కేవీఎస్ రవికుమార్, యువ నాయకుడు మలిరెడ్డి పాపారావు, జెట్టి గ్రానైట్ అధినేత శివ, ఎస్ఆర్‌కే రామకృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

### నేడు విధుశేఖర భారతీ మహాస్వామి రాక

తుని రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాండవ కాశీగా పేర్గాంచిన కుమ్మరిలోవ తపోవనానికి శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధు శేఖర భారతీ మహాస్వామి శుక్రవారం విచ్చేయనున్నారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు దంపతులతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. మహా స్వామికి ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద స్వామి ధూళి పాదపూజ నిర్వహిస్తారు. అనంతరం ఆశ్రమంలో సహస్ర మోదక గణపతి హోమం, శ్రీరుద్రయాగ పూర్ణాహుతి, విద్వద్ గోష్టి, మహా ప్రదోష నీరాజనం నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో స్వామీజీ శిష్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

### వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

శంఖవరం, నవంబరు 27: (ఆంధ్రజ్యోతి) పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి-గోవిందాంబ దివ్య కల్యాణం బుధవారం కనుల పండువగా జరిగింది. యండమూరి వీరవెంకటరమణ-రామలక్ష్మి, యండమూరి వీరబాబు-వీరవేణి దంపతులతో అర్చకుడు సతీష్‌శర్మ కల్యాణ క్రతువు జరిపించారు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, చింతంనీడి కుమార్, పర్వత కృష్ణ, పర్వత సత్యనారాయణ, బుర్రా వాసు, బుర్రా ప్రసాద్, రౌతు శ్రీను తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## 7న మెగా పీటీఎం

తొండంగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7న పాఠశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఎంఈవోలు షేక్ బాబ్జీ, అనిశెట్టి సుబ్బిరెడ్డి తెలిపారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పీటీఎం నిర్వహణకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలన్నారు. ప్రోగ్రెస్ కార్డులను సమావేశంలో తల్లిదండ్రులకు అందించాలన్నారు. పూర్వ విద్యార్థులను, దాతలను, తల్లిదండ్రులను పిలవాలన్నారు. దాతల సహకారంతో భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. మొత్తం కార్యక్రమాన్ని నమోదు చేసి డాక్యుమెంట్ సమర్పించాలన్నారు. సీఆర్పీలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## తొమ్మిది వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తొండంగి/తుని రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్-ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు వి.రేణుక ఆధ్వర్యంలో బుధవారం తొండంగి మండలంలో నిర్వహించిన దాడుల్లో తొమ్మిది వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తుని ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. కోన ప్రాంతంలో గల గడ్డిపేట, బుచ్చియ్యపేట, ఆవులమంద ప్రాంతంలో దాడులు జరిపి నాటు సారా తయారీ కోసం పులియబెట్టిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. దీంతో పాటు 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెంలో 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తుని ఎక్సైజ్ సీఐ పట్టాభి చౌదరి తెలిపారు.

**ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కె.మిర్తివాడలో ఎక్సైజ్ సిబ్బంది సారా బట్టీలపై దాడులు చేసి 1,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ డి.శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.